www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 139 శనివారం, అక్టోబర్ 03, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా

# అల్పాహార పథకం

**పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

**సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు**

**నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు**

**నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం**

**ఆహార నాణ్యత కు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన**



**హైదరాబాద్, అక్టోబర్ 02 :**
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి.
జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మిగతాది 2లో...

# హాకీలో స్వర్ణం

**44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్**

**ఆసియా గేమ్స్ మహిళల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం**

**ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో ఉత్కంఠభరిత విజయం**

**2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన భారత్**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 02 :**
భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి.అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలుపొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. మిగతాది 2లో...

# గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

**గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే మా పాలన**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**గాంధీ భవన్‌లో గాంధీ జయంతి వేడుకలు**

**హైదరాబాద్, అక్టోబర్ 02(ఆర్ఎన్ఏ):**



**హైదరాబాద్, అక్టోబర్ 02 :**
గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళు లర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ మిగతాది 2లో...

# మీరు నా ఆరాధ్య దైవం

**మోదీతో అంటూ స్మిత్ భావోద్వేగం**

**దుబాయ్ హీరో పైలట్ స్మిత్ మచ్చర్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోదీ**

**స్మిత్ ధైర్యసాహసాలను కొనియాడి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**దాడి సమయంలో హనుమాన్ చాలీసా పఠించానని ప్రధానికి వివరించిన పైలట్**

**వైద్య సహాయంతో పాటు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చిన ప్రధాని**



వివరాలు 2లో

# కరవుసీమ ఇకపై కనకసీమ



**మదనపల్లెలో "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్" శంకుస్థాపన**

**సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న చంద్రబాబు**

**మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య**




**మదనపల్లె అక్టోబర్ 02 :**
కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 2లో...



# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

**టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాల విక్రయాన్ని ఆపాలని వినతి**

**ఇది విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు తొలి అడుగని ఆందోళన**

**కాంగ్రెస్ జాతీయ విధానాలకు ఇది విరుద్ధమని లేఖలో ప్రస్తావన**

**హైదరాబాద్, అక్టోబర్ 02 :**
తెలంగాణలోని కీలక విద్యుత్ రంగ సంస్థల్లో వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను ఐపీఓ మిగతాది 2లో...

## గాంధీ ఆరాధించిన రాముడు

# ధనికుల దేవుడా

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్**

**గాంధీ ఆశయాలను ప్రధాని మోదీ నెరవేరుస్తున్నారని, నిజమైన వారసులు బీజేపీయేనని వ్యాఖ్య**

**ఖైరతాబాద్ ఉపఎన్నికలో హిందూ ఓట్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా**



**హైదరాబాద్, అక్టోబర్ 02 :**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి మిగతాది 2లో...

# కొడంగల్‌లో సభ పెడతాం

**రేవంత్ కు చెమటలు పట్టిస్తాం**

**ఖైరతాబాద్ లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం**

**తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు**

**హైదరాబాద్, 02 :**
తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది.
హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి మిగతా 2లో...



# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

**19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు**

**కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా**

**హైదరాబాద్, అక్టోబర్ 02 :**
తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మిగతాది 2లో...



# గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా విక్రయించి నిధులు సమీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజాధనంతో నిర్మితమైన టీజీ ట్రాన్స్‌కో, రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థకు వెన్నెముక వంటిదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. వేలాది కిలోమీటర్ల మేర విస్తరించిన విద్యుత్ లైన్లు, హై-వోల్టేజ్ సబ్‌స్టేషన్లతో కూడిన ఈ సంస్థ అత్యంత విలువైన ఆస్తి అని వివరించారు. ట్రాన్స్‌కోలో ప్రైవేట్ వాటాలకు అనుమతినిస్తే, భవిష్యత్తులో టీజీ జెన్‌కో, సింగరేణి, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు కూడా ఇది మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ తీర్మానాలకు విరుద్ధమని హరీశ్ రావు ప్రశ్నించారు. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత లేని, నష్టాల్లో ఉన్న సంస్థల్లో మాత్రమే పెట్టుబడుల ఉపసంహరణకు కట్టుబడి ఉన్నామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ వంటి సంస్థలను ప్రైవేటీకరిస్తుంటే తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని నిలదీశారు. విద్యుత్ సంస్థల యాజమాన్య హక్కులపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

కాగా, ప్రైవేటీకరణ, వాటాల విక్రయం లేదా పబ్లిక్ ఇష్యూపై ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని టీజీ ట్రాన్స్‌కో వర్గాలు వెల్లడించాయి.

# హాకీలో స్వర్ణం



(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు.భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

# కొడంగల్‌లో సభ పెడతాం

(మొదటి పేజీ తరువాయి)

తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

# గాంధీ ఆరాధించిన రాముడు ధనికుల దేవుడా

(మొదటి పేజీ తరువాయి)

నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీ వారసత్వం తమదేనని చెప్పుకునే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని ఆయన విమర్శించారు. శ్రీరాముడిని "ధనికుల దేవుడు"గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.నిత్యం 'రామ' నామాన్ని జపించిన గాంధీ ఆరాధించిన రాముడు, కేవలం ధనికులకే దేవుడా, లేక ప్రజలందరి దేవుడా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను బండి సంజయ్ ప్రశ్నించారు. గాంధీజీ సత్యం, ధర్మం, న్యాయంతో కూడిన సనాతన ధర్మాన్ని పాటించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్, వారసత్వ రాజకీయాలు, అవినీతి, హిందూత్వ వ్యతిరేకత విధానాలతో నడిచే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని, దీనిని నడిపిస్తున్నది "డూప్లికేట్ గాంధీ కుటుంబం" అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిందూ సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తోందని విమర్శించారు.మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రజా జీవితానికి దూరమైన కేసీఆర్, ప్రపంచంలోనే అత్యంత అహంకారపూరిత నాయకుడని దుయ్యబట్టారు. గాంధీ కలలు కన్న రామరాజ్యం, స్వచ్ఛ భారత్ వంటి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, గాంధీకి నిజమైన వారసులు తామేనని ఆయన స్పష్టం చేశారు.

త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, ఈ ఎన్నిక రావడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని సంజయ్ ఆరోపించారు. ఆ నియోజకవర్గంలోని 2 లక్షల మంది హిందూ ఓటర్లను విస్మరించి, కేవలం 32,000 ముస్లిం ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసినా ప్రజలు వారిని తిరస్కరిస్తారని, ఖైరతాబాద్‌లో హిందూ ఓటర్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. "డబుల్ ఇంజిన్" సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# మీరు నా ఆరాధ్య దైవం

## మోదీతో అంటూ స్మిత్ భావోద్వేగం

న్యూఢిల్లీ, అక్టోబర్ 02 :

విమానంలో తోటి పైలట్ దాడిని ఎదుర్కొని, 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఫ్లైదుబాయ్ విమాన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ యోగక్షేమాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు.

ఆయన ధైర్యసాహసాలను కొనియాడుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాని నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు అతిపెద్ద ఆరాధ్య దైవం, ఆదర్శప్రాయుడు ప్రధాని మోదీయేనని, ఆయనతో మాట్లాడే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు.

దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై తోటి పైలట్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి కుప్పకూలినప్పటికీ, స్మిత్ అసామాన్యమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. చివరి క్షణంలో కాక్‌పిట్ డోర్ లాచ్‌ను నొక్కి తలుపు తెరిచారు.

దీంతో ప్రయాణికులు వెంటనే లోపలికి ప్రవేశించి, దాడి చేస్తున్న పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్మిత్ సమయస్ఫూర్తి వల్ల 9/11 తరహా పెను ప్రమాదం తప్పిందని, 174 మందికి పైగా సురక్షితంగా బయటపడ్డారని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధానితో సంభాషణ సందర్భంగా స్మిత్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాను కష్ట సమయాల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని, విమానంలో దాడి జరిగినప్పుడు కూడా ప్రాణాలతో పోరాడుతూ హనుమాన్ చాలీసానే చదువుకున్నానని వివరించారు.

అనంతరం ప్రధాని మోదీ, స్మిత్ తల్లి గీతా బెన్‌తో కూడా మాట్లాడారు. భగవద్గీత విలువలు, బోధనలతో కుమారుడిని పెంచినందుకు ఆమెను అభినందించారు. స్మిత్ త్వరగా కోలుకోవడానికి అవసరమైన వైద్య సహాయంతో పాటు అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాని మోదీ వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# కరవుసీమ ఇకపై కనకసీమ

(మొదటి పేజీ తరువాయి)

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని వివరించారు.

ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి: పవన్ కల్యాణ్

రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే



అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు.

ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీఎం చంద్రబాబు గారూ.. 'నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి.. రాష్ట్రానికి ఏం చేయగలనో చెప్పండి': అనంత్ అంబానీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాటిచెప్పారు. "నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన వినమ్రంగా కోరారు.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం



పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు.

ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది. ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం" అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. 'కియో కృషి' ద్వారా రైతులకు జియో పూర్తి సహకారం అందిస్తుందని, 'దేశ్ సేవా-కిసాన్ సేవా' తమ నినాదమని స్పష్టం చేశారు. 'పశు సేవా హీ ప్రభు సేవా' అని తాను విశ్వసిస్తానని, 'వంతారా' ద్వారా జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అద్భుతంగా ఉందని, అందుకే రాష్ట్రం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని కొనియాడారు.

# డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం

(మొదటి పేజీ తరువాయి)

మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయం ను సందర్శించిన ఇస్రో శాస్త్రవేత్త సుశీల్ కుమార్ శ్రీవాత్సవ









**ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02 (పీపుల్స్ న్యూస్)**
మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం ఇస్రో శాస్త్రవేత్త ( అడిషనల సెక్రటరీ ఇస్రో) సుశీల్ కుమార్ శ్రీవాత్సవ దంపతులు దర్శించుకున్నారు. సందర్బంగా వారికి ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, ఆర్ ఐ రమేష్, టూరిస్ట్ పోలీసులు, శ్రీకాంత్, బద్రు, శ్రీనివాస్, అరుణ్, రెవిన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

# స్వచ్ఛ మైన త్రాగు నీరు ఐజల్ వాటర్ ప్లాంట్

**- సర్పంచ్ సుగుణ**



**వెంకటాపూర్ ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02 (పీపుల్స్ న్యూస్)**
ఐజల్ వాటర్ స్వచ్ఛమైన త్రాగునీరు అని గ్రామస్థులకు 5 రూ.లకె వాటర్ ని అందిస్తున్న ఐజల్ సంస్థ వారిని గ్రామ సర్పంచ్ మామిడిశెట్టి సుగుణ అభినందించారు. శుక్రవారం రోజున గ్రామంలో ఐజల్ వాటర్ ప్లాంటు ను సర్పంచ్ సుగుణ ప్రారంభించారు.అనంతరం సర్పంచ్ సుగుణ మాట్లాడుతు స్వచ్ఛమైన తాగునీరు లేకపోతే ప్రజలు అనారోగ్యా లు భారిన పడే అవకాశం ఉందని అన్నారు.అతి తక్కవ ధరకు వాటర్ ను అందజేస్తున్న ఐజల్ వాటర్ ను తాగాలని గామస్థులకు సూచించారు. అలాగే గ్రామానికి ఎలాంటి సౌకర్యాలు కావాలన్న తమున్నామనే సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అన్నే వేన రాజు ,రామప్ప ఆలయ చైర్మన్ మిలుకురి ఐలయ్య,యన్ యస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు మామిడి శెట్టి కోటి ,గ్రామ కమిటీ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, వార్డు మెంబర్లు నల్ల కోటి,భానోతు సునీల్,గుర్రం తిరుపతి,కంది కొండ మొగిలి, ఐజల్ వాటర్ ప్లాంట్ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ రాజేశ్వర్ రావు,ఆపరేటర్ ఆకుల రామకృష్ణ ,కాంగ్రెస్ నాయకులు చీకుర్తి రమేష్,మెట్టు సురేష్,కనుకుంట్ల భిక్షపతి ,రెడ్డి శ్రీధర్ , తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం

**-శ్రీ.శ్రీనగర్‌లో ఘనంగా జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు**




**బాలానగర్ అక్టోబర్ 03 ( పీపుల్స్ న్యూస్)**
జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కూకట్‌పల్లి మండలం శ్రీశ్రీనగర్‌లోని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్యాలయంలో గురువారం గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ దేశానికి అందించిన సేవలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. సత్యం, అహింస, శాంతి, సహనం వంటి గాంధీజీ ప్రబోధించిన విలువలు సమాజ అభ్యున్నతికి నేటికీ ఎంతో అవసరమని పేర్కొన్నారు. అహింసా మార్గంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో గాంధీజీ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన చూపిన సత్యం, అహింసా మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరిస్తూ సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం కలిగిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె. కృష్ణాచారి, గంగన్నతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

# ఎలిమ్ ఎంబీ చర్చిలో ఘనంగా 'రైస్ అప్' యువత ఆధ్యాత్మిక శిబిరం.

**-- యువతలో ఆధ్యాత్మిక చైతన్యం,**
**-- ఐక్యత, నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యం**




**బాలానగర్ అక్టోబర్ 03 ( పీపుల్స్ న్యూస్)**
బాలానగర్ డివిజన్ పరిధిలోని ఎలిమ్ ఎంబీ చర్చిలో 'రైస్ అప్' పేరుతో యువత కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఆధ్యాత్మిక శిబిరం శుక్రవారం ఘనంగా జరిగింది. ఎలిమ్ ఎంబీ చర్చి యువజన సంఘం ఆధ్వర్యంలో, చర్చి పాలకవర్గం సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బాలానగర్‌తో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు, వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తిశ్రద్ధలు, ఉత్సాహభరితమైన కీర్తనలు, స్తుతి ఆరాధనల నడుమ ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక శిబిరం ఆద్యంతం ఉత్సాహభరితంగా కొనసాగింది. యువతలో దైవభక్తిని పెంపొందించడం, ఆధ్యాత్మిక విలువలను అలవర్చడం, పరస్పర స్నేహభావం, ఐక్యతను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాస్టర్ ఎర్నెస్ట్ మోహంతి, జూబ్లీహిల్స్ క్రైస్తవ మైనారిటీ సభ్యురాలు టి. ప్రవీణ, న్యాయనిర్ణేతలు దినకర్, నిర్మల దినకర్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎలిమ్ ఎంబీ చర్చి పాస్టర్ రెవరెండ్ జి.కె. ప్రసాద్ మాట్లాడుతూ, యువతలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు వారిలో స్నేహభావం, ఐక్యత, క్రమశిక్షణ, నైతిక విలువలను బలోపేతం చేయడంలో ఇటువంటి ఆధ్యాత్మిక శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. నేటి ఆధునిక సమాజంలో యువత ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, దైవవాక్యాన్ని అనుసరిస్తూ సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని గడపాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా అందించే ఆధ్యాత్మిక సందేశాలు యువతలో నూతన ఆలోచనలను, ఆత్మవిశ్వాసాన్ని, భవిష్యత్తుపై ఆశాభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

# మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నివాళులు.



**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో అక్టోబర్ 2 (పీపుల్స్ న్యూస్)**
జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ ఎన్. సురేష్, డీఐపీ పి. నరేంద్రరెడ్డి, పోలీస్ సిబ్బంది మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ ఆశయాలు, సత్యం, అహింస, శాంతి మార్గాలను స్మరించుకున్నారు.

# గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- సత్యం, అహింస, శాంతి, సామాజిక న్యాయం గాంధీజీ చూపిన మార్గాలు
- మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు



**బాలానగర్ అక్టోబర్ 03 ( పీపుల్స్ న్యూస్)**
జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ మాజీ అధ్యక్షుడు బేగంపేట రమేష్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మా గాంధీ చేసిన పోరాటాన్ని, దేశ ప్రజలకు ఆయన అందించిన స్ఫూర్తిదాయక సందేశాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వం పరిఢవిల్లాలంటే ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యత పెంపొందాలని దర్గా కరుణాకర్ అన్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలు, నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి సమష్టి కృషితోనే పరిశుభ్రమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
మహాత్మా గాంధీ కలలు కన్న సమాజంలో కుల, మత, ప్రాంతీయ భేదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం, న్యాయం లభించాలని ఆయన ఆకాంక్షించారని గుర్తుచేశారు. పేదలు, బలహీనవర్గాలు, అణగారిన ప్రజల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను తొలగించి, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయడమే గాంధీజీకి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన అహింసా మార్గం, సత్యనిష్ఠ, సేవాభావం, మానవతా దృక్పథం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని, ఆయన ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దర్గా కరుణాకర్ అన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా శాంతియుత, సమానత్వ, సామాజిక న్యాయంతో కూడిన సమాజ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, పాల్, కృష్ణ, దామోదర్ రెడ్డి, పద్మారావు, మహీంద్ర, నవీన్, శ్రీను, రాజు తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

# ఆటో కార్మికులకు గుడ్ న్యూస్.. ఛార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో

**హైదరాబాద్, అక్టోబర్ 2:** ఆటో కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఆటో ఛార్జీలను పెంచుతూ జీవో విడుదల చేసింది. పెరిగిన ఇంధనం ధరలు, వాహన నిర్వహణ, ఇన్సూరెన్స్, ఇతర నిర్వహణ ఖర్చుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఆటో డ్రైవర్లకు సముచిత ఆదాయం కల్పించడంతో పాటు ప్రయాణికులపై అధిక భారం పడకుండా ఛార్జీలను సవరించినట్లు వెల్లడించింది.తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.20 నుంచి రూ.30 వరకు విధించగా.. ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.11 నుంచి రూ.14 వరకు చెల్లించాల్సి ఉంటుంది. డిటెన్షన్ ఛార్జీలను నిమిషానికి 50 పైసల నుంచి 75 పైసలకు పెంచింది. అర్హత ఉన్న ప్రతి లగేజీ ప్యాకేజీపై ఛార్జీని 25 పైసల నుంచి 50 పైసలకు పెంచింది. అయితే.. గరిష్ఠ లగేజీ పరిమితి 100 కిలోలుగానే కొనసాగిస్తున్నట్టు పేర్కొంది.ఇక.. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు 1.5 రెట్లు అధిక ఛార్జీలను యథాతథంగా విధించుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. మీటర్ల రీసెట్టింగ్‌కు 3 నెలల గడువునిచ్చింది.

# ఖైదీలు సన్మార్గంలో నడవాలి

**- భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి: కలెక్టర్ కె.హరిత**
**- గాంధీ జయంతి సందర్భంగా జన్కపూర్ జైలు సందర్శన**



**కొమరం భీం, అక్టోబర్ 2**
ఖైదీలు గతంలో జరిగిన తప్పుల గురించి ఆలోచిస్తూ ఉండకుండా భవిష్యత్తుపై దృష్టి సారించి సన్మార్గంలో నడవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా శు క్రవారం జిల్లా కేంద్రంలోని జన్కపూర్ జైలును ఆమె సందర్శించారు.జైలులో గడిపే సమయాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ప్రవర్తనతో మెలగాలని, బయటకు వెళ్లిన తర్వాత కుటుంబం, సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించాలని ఖైదీలకు సూచించారు. భవిష్యత్తులో ఉపాధికి ఉపయోగపడేలా జైలులో అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఖైదీలకు గాలి, నీరు, వెలుతురు, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ వంటి సౌకర్యాలు కల్పి స్తున్నట్లు తెలిపారు. చదువుపై ఆసక్తి ఉన్నవారు ఓపెన్ స్కూలింగ్, దూరవిద్య, ఓపెన్ యూనివర్సిటీ కోర్సుల ద్వారా ఉన్నత చదువులు కొనసాగించవచ్చన్నారు.కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అనూష, అదనపు ఎస్పీ చిత్తరంజన్, జైలర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ బైకులు పర్యావరణానికి మేలు చేస్తాయి.

**-ఈఈటుగో ఎండి శ్రీనివాస్ రెడ్డి**







**ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02 (పీపుల్స్ న్యూస్)**
ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించడం ద్వారా పర్యావరణానికి, ఆర్థికంగా మేలు చేస్తాయని ఎలక్ట్రిక్ ఎన్విరో ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డిఅన్నారు. గురువారం ములుగు గట్టమ్మ దేవాలయం వద్ద వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఈ ఈ టు గో సలహా సలహాదారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడారు . పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో చాలా మంది సాంప్రదాయ బైకుల నుండి ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. వీటిని వినియోగించడంలో సరైన అవగాహన కలిగి ఉంటే ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బైకుల వినియోగం పెరుగుతుందని , దానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు ఎలక్ట్రిక్ బైకులను కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీం ఫౌండర్ సంజీవయ్య, కుమారస్వామి, వెంకట్ రెడ్డి, గణేష్, బిక్షపతి , పరశురాములు ,సతీష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో వన్యప్రాణుల వారోత్సవాల ర్యాలీ

**అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**
**అక్టోబర్ 7 వరకు వారోత్సవాలు**



**కొమరం భీం, అక్టోబర్ 2**
కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో వన్యప్రాణుల వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 2 నుంచి 7 వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.అటవీ డివిజనల్ అధికారి టి.భార్గవ్‌కుమార్, కాగజ్‌నగర్ అటవీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో అటవీ శాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో అడవులు, వన్యప్రాణుల పాత్ర కీలకమని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా రామచంద్రయ్యకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు సన్మానం

- వృద్ధుల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్న టెస్కాన్ అధ్యక్షుడు రామచంద్రయ్యకు ఘన సత్కారం
- సమాజంలో వారికి తగిన గౌరవం కల్పించే దిశగా కృషి చేస్తున్న రామచంద్రయ్య సేవలను గుర్తిస్తూ మంత్రి ఈ సన్మానం అందజేశారు.



**బాలానగర్ అక్టోబర్ 03 ( పీపుల్స్ న్యూస్)**
ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టెస్కాన్ అధ్యక్షుడురామచంద్రయ్య తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రామచంద్రయ్యను శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సన్మానం వృద్ధుల పట్ల సమాజానికి ఉండాల్సిన గౌరవం, ఆదరణ, బాధ్యతలను చాటిచెప్పింది. వృద్ధులు తమ జీవితకాలంలో సంపాదించిన అనుభవం, విజ్ఞానం, విలువలు భావితరాలకు ఎంతో విలువైన మార్గదర్శకాలని, కుటుంబ వ్యవస్థతో పాటు సమాజ నిర్మాణంలోనూ వారు కీలక పాత్ర పోషిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వృద్ధుల సేవలను గుర్తించి, వారికి తగిన గౌరవం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సమాజంలోని అన్ని వర్గాలు కృషి చేయాల్సిన అవసరం ఉందనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. సమాజ అభివృద్ధిలో వృద్ధుల పాత్రను గుర్తిస్తూ, వారి సంక్షేమం, సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవనానికి ప్రాధాన్యత కల్పించాల్సిన ఆవశ్యకతను ప్రపంచ వృద్ధుల దినోత్సవం చాటిచెబుతోంది. వృద్ధుల పట్ల ప్రేమాభిమానాలు చూపడంతో పాటు వారి అనుభవాలను గౌరవించి, భావితరాలకు అందించడం ద్వారా ఆరోగ్యకరమైన, మానవీయ విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా టెస్కాన్ అధ్యక్షుడు రామచంద్రయ్య సన్మానం పొందడం విశేషంగా నిలిచింది. ఈ గౌరవం వృద్ధుల పట్ల సమాజంలో గౌరవభావాన్ని మరింత పెంపొందించడంతో పాటు, వారి సేవలను గుర్తించి అభినందించాల్సిన అవసరాన్ని మరోసారి తెలియజేసింద అన్నారు. మంత్రి మాట్లాడుతూ వృద్ధులు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా అమూల్యమైన సంపద అని, వారి జీవితానుభవాలు భావితరాలకు ఎంతో విలువైన మార్గదర్శకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరికీ ఆత్మీయత, ఆదరణ, గౌరవం, భద్రతతో కూడిన జీవనం అందించాల్సిన బాధ్యత కుటుంబాలతో పాటు సమాజంపై కూడా ఉందని తెలిపారు. వృద్ధుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.. టెస్కాన్ అధ్యక్షుడు రామచంద్రయ్య వృద్ధుల సంక్షేమం పట్ల చూపుతున్న నిబద్ధత, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యాన్ని గుర్తిస్తూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సన్మానించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సన్మానం వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న వారికి మరింత ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు, సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, బాధ్యతాభావాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సన్మానించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, గౌరవప్రదమైన జీవనం కోసం తన వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానని పేర్కొన్నారు. వృద్ధుల సేవలకు సముచిత గుర్తింపు లభించిన ఈ సన్మాన కార్యక్రమం ప్రపంచ వృద్ధుల దినోత్సవ స్ఫూర్తిని చాటిచెప్పింది. వృద్ధులను గౌరవించడం, వారి అనుభవాలను గౌరవించడం, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది.

# బెజ్జూరులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఎన్నిక

**మండల అధ్యక్షుడిగా ఆత్రం బక్కయ్య**



**బెజ్జూరు, అక్టోబర్ 2 :** మండల కేంద్రంలో శుక్రవారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆత్రం బక్కయ్య, నిర్వహణ అధ్యక్షుడిగా గోరంట్ల వసంత్, ప్రధాన కార్యదర్శిగా కాజా రహీముద్దీన్, కోశాధికారిగా వసంత్ ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు రామ్‌చందర్ తెలిపారు.ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

**-- సత్యం, అహింస, శాంతి మార్గాలతోనే ఉన్నత లక్ష్యాల సాధన సాధ్యం**




**బాలానగర్ అక్టోబర్ 03 ( పీపుల్స్ న్యూస్)**
జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సైదులు, పోలీసు సిబ్బంది మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీ చేసిన అపారమైన సేవలను, ఆయన అనుసరించిన సత్యం, అహింస, శాంతి మార్గాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయుధాలు, యుద్ధాలు, దండయాత్రలతో కాకుండా సత్యాగ్రహం, అహింస అనే శక్తివంతమైన మార్గాల ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించి ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని కొనియాడారు. జీవితంలో ఎలాంటి ఉన్నత లక్ష్యాన్ని సాధించాలన్నా సత్యం, అహింస, క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమని, ఈ విలువలను తన జీవితంలో ఆచరించి చూపిన మహనీయుడు మహాత్మా గాంధీ అని అన్నారు. మహాత్మా గాంధీ రచించిన 'సత్యశోధన' పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన గొప్ప గ్రంథమని ఇన్‌స్పెక్టర్ సైదులు అభిప్రాయపడ్డారు. ఆత్మపరిశీలన, నిజాయితీ, నైతికత, సత్యనిష్ఠ వంటి విలువలను గాంధీజీ జీవిత అనుభవాల ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. అధికారం, ఆస్తిపాస్తులు, సంపద కంటే సద్గుణాలు, నమ్మిన సిద్ధాంతాల పట్ల నిబద్ధత, ప్రజాసేవే మనిషికి నిజమైన గౌరవాన్ని తీసుకొస్తాయని గాంధీజీ జీవితం నిరూపించిందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, హింసాత్మక పోరాటాలు కొనసాగుతున్న తరుణంలో అహింస, సత్యాగ్రహం, సహనం, పరస్పర గౌరవం వంటి గాంధీజీ ఆశయాలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం వెల్లివిరియాలంటే ప్రతి ఒక్కరూ అహింసా మార్గాన్ని అనుసరించాలని, భిన్నాభిప్రాయాలను గౌరవి స్తూ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పిలుపు నిచ్చారు. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింసా మార్గాలు కేవలం స్వాతంత్ర్య పోరాటానికే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి నిత్యజీవితంలోనూ ఆచరించదగిన గొప్ప జీవన సూత్రాలని వివరించారు. మహాత్మా గాంధీ ఆశయాలను భావితరాలకు అందించడం, ఆయన బోధించిన నైతిక విలువలను ఆచరణలో పెట్టడం ప్రతి పౌరుడి బాధ్యతని ఇన్‌స్పెక్టర్ సైదులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అహింసా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా శాంతియుత, సామరస్యపూర్వక సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బేగంపేట పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

# పద్మనగర్ డివిజన్‌లో ఘనంగా గాంధీ జయంతి

**స్వచ్ఛ భారత్ కార్యక్రమంతో పాటు పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం**







**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 2 (పీపుల్స్ న్యూస్)**
మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 285 పద్మనగర్ డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలన 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చేపట్టిన సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో, పద్మనగర్ డివిజన్ అధ్యక్షులు కట్టా కుమార్ నేతృత్వంలో పద్మనగర్ ఫేజ్-2 రింగ్ రోడ్డు సమీపంలోని శివాలయం, ఎన్‌టీఆర్ నగర్‌లోని హనుమాన్ ఆలయం, సుదర్శన్ రెడ్డి నగర్‌లోని ఎల్లమ్మ తల్లి ఆలయ పరిసరాల్లో శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కట్టా కుమార్, శోభాకుమార్ దంపతులు జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులను శాలువాలతో సన్మానించి, చీరలను పంపిణీ చేశారు. ప్రజారోగ్యం, పారిశుధ్య పరిరక్షణలో కార్మికులు అందిస్తున్న సేవలను వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి శ్రీధర్ వర్మ, 284 డివిజన్ బీజేపీ అధ్యక్షులు సునీల్, డివిజన్ ప్రధాన రాజశేఖర్, నాగ శ్రీనివాస్, విగ్నేష్, బీఎంఎస్ నాయకులు, బీజేపీ కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు సానబోయిన సుజాత, నరసింహ చారి, మహేశ్వరి, చంద్రకళ, విమేష్, సిద్ధి రాములు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలకు కర్ర పూజ

**జోగిపేటలో ఘనంగా ప్రారంభమైన ఏర్పాట్లు**



**సంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 2 ):** శ్రీ దుర్గా భవాని దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం జోగిపేట పట్టణంలోని వీర హనుమాన్ మందిర్ చౌరస్తా వద్ద శుక్రవారం కర్ర పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుడుతూ సాంప్రదాయబద్ధంగా కర్ర పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై నిర్వాహకులు దృష్టి సారించారు.ఈ కార్యక్రమంలో స్నేహ, సిరి డ మాత టీమ్ సభ్యులతో పాటు పులుగు గోపాల్, తుపాకుల సునీల్, ఉల్వాల రాజు, గాజుల అనిల్, గణేష్, జగదీష్, మహేష్, కన్నా, హనుమంతు, నికిల్, వసంత్ తదితరులు పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని నిర్వాహకు కోరారు

# ప్రపంచానికి ఆదర్శప్రాయుడు మహాత్మా గాంధీ

**- జోగిపేట్ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ జిశాన్**



**సంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 2 :** ప్రపంచానికి ఆదర్శప్రాయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని ఆందోల్--జోగిపేట్ మున్సిపాలిటీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ జిశాన్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జోగిపేట్ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఆయన స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిశాన్ మాట్లాడుతూ.. సత్యం, అహింస మార్గాల్లో నడిచి దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి మహాత్మా గాంధీ నాయకత్వం వహించారని తెలిపారు. ఆయన జీవితం, సిద్ధాంతాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. మహాత్మా గాంధీ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకునేలా గ్రామపంచాయతీ ఆవరణల్లో, ప్రధాన కూడళ్లలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జోగిపేట్ పట్టణ నాయకులు, పుర ప్రముఖులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

**-- బాలానగర్‌లో మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు**

**బాలానగర్ అక్టోబర్ 03 ( పీపుల్స్ న్యూస్)**
జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి, భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను పురస్కరించుకొని కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీ అనుసరించిన సత్యం, అహింస మార్గాలు, దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అదేవిధంగా, దేశ ప్రధానిగా లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలు, దేశ అభివృద్ధి, వ్యవసాయ రంగ పురోగతి, సైనికుల



సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. నిరాడంబరత, నిజాయతీ, నిబద్ధతతో ప్రజాసేవకు అంకితమైన మహనీయుల జీవితాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో ఐక్యత, శాంతి, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపగోని శ్రీనివాస్ గౌడ్ ,బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, ప్రధాన కార్యదర్శి ఎరుపుల మహేందర్, ఎస్సీ విభాగం నాయకుడు జల్లా శివ, పార్టీ నాయకులు సత్యపాల్ రెడ్డి, యాదగిరి గౌడ్, రవి ముదిరాజ్, సదా గౌడ్, రవికుమార్ గౌడ్, , బి.ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు రేణుక, సాయి భారతి, శ్రీమా, పద్మావతి, ఇంద్రాణి, ఊర్మిళ, తార, శ్వేతతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు.

# గాంధీజీ సేవలు చిరస్మరణీయం

**గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసిన మాజీ జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి**



**నాగిరెడ్డిపేట,అక్టోబర్ 2** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని జీడిమెట్ల జాతీయ రహదారి సమీపంలోని గాంధీజీ విగ్రహానికి మాజీ రాష్ట్ర జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, ధమని శ్రవణ్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి చేసిన సేవలను వారు స్మరించుకున్నారు.గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బేగంపేటలో మరో రెండు చెట్ల ట్రాన్స్‌లోకేషన్

**- ఇప్పటివరకు 45 చెట్లను విజయవంతంగా తరలించిన మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు**









**మల్కాజిగిరి కమిషనరేట్,క్రైమ్ బ్యూరో అక్టోబర్ 2 (పీపుల్స్ న్యూస్)**
ట్రాఫిక్‌కు ఆటంకంగా మారుతున్న చెట్లను తొలగించకుండా సంరక్షించే లక్ష్యంతో మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న ట్రాన్స్‌లోకేషన్ కార్యక్రమం కొనసాగుతోంది. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో బేగంపేటలోని ఆర్‌బీఐ క్వార్టర్స్, శ్యామల్ ఎదురుగా ఉన్న మరో రెండు పెల్టోఫోరం చెట్లను శుక్రవారం విజయవంతంగా ట్రాన్స్‌లోకేట్ చేశారు.సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన అనంతరం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, చెట్లను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఈ చెట్లను సమీపంలోని ఎయిర్‌పోర్టు సమీపంలోని గ్రేవ్‌యార్డ్‌కు తరలించారు.ఈ రెండు చెట్లతో కలిపి మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు ఇప్పటివరకు మొత్తం 45 చెట్లను విజయవంతంగా ట్రాన్స్‌లోకేట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంతకుముందు ఈ సంఖ్య 43గా ఉండగా, తాజాగా మరో రెండు చెట్లను తరలించడంతో 45కు చేరింది.ట్రాఫిక్ సాఫీగా సాగడంతో పాటు రహదారి భద్రత, పర్యావరణ పరిరక్షణకు అవసరమైన చర్యలను మల్కాజ్‌గిరి పోలీసులు నిరంతరం చేపడుతున్నారని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు, ట్రాఫిక్ పీఎస్ బేగంపేట ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసులు, ఎస్ఐ కె. దేవీదాస్, ఆర్ఎస్ఐ ఎ. అశోక్ రెడ్డి, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, డీఆర్ఎఫ్ బృందం సమన్వయంతో నిర్వహించారు. రోడ్డు వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చెట్లను సురక్షితంగా తరలించినట్లు తెలిపారు.

# గాంధీ--శాస్త్రి జయంతి వేడుకల్లో స్వచ్ఛ భారత్‌కు పెద్దపీట



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 2**
బీహెచ్‌ఈఎల్‌లో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీహెచ్‌ఈఎల్ ఈడీ జి. సుబ్రహ్మణ్యం, జీఎం హెచ్‌ఆర్ శ్రీమతి సంధ్యాకర్, బీడబ్ల్యూసీ జీఎస్‌పీ వినోద్ కుమార్ తదితర అధికారులు మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం స్వచ్ఛ భారత్ స్పెషల్ క్యాంపెయిన్ 6.0లో భాగంగా లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం ఆవరణలో పూల మొక్కలు నాటారు. పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, పరిశుభ్రమైన పరిసరాల పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యతను చాటిచెప్పేలా ప్రతిజ్ఞ చేశారు.అనంతరం మహాత్మా గాంధీ విగ్రహం నుంచి నెహ్రూ పార్క్ వరకు స్వచ్ఛతా వాక్ నిర్వహించారు. స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు పరిశుభ్రమైన పరిసరాల ప్రాధాన్యతను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీహెచ్‌ఈఎల్ ఈడీ జి. సుబ్రహ్మణ్యం, జీఎం హెచ్‌ఆర్ శ్రీమతి సంధ్యాకర్, బీడబ్ల్యూసీ జీఎస్‌పీ వినోద్ కుమార్‌తో పాటు జీఎంలు, ఏజీఎంలు, డీఆర్వోలు, బీడబ్ల్యూసీ కార్యవర్గ సభ్యులు, వివిధ యూనియన్ నాయకులు, అసోసియేషన్ల సభ్యులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

## - డబ్బా బారేగూడలో లబ్దిదారుడికి అందజేత
## - మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ



**చింతలమానేపల్లి, అక్టోబర్ 2 :** మండలంలోని డబ్బా బారేగూడ గ్రామానికి చెందిన బోర్లే వెంకటేశ్‌కు మంజూరైన సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు డుబ్బుల నానయ్య, ఉపాధ్యక్షుడు అంగోలా చిలకయ్య, పార్టీ నాయకులు చెక్కును పంపిణీ చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన నీకోడే పెంటుబాయ్ కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీకి ఘన నివాళులు





**కూకట్‌పల్లి, అక్టోబర్ 2 (పీపుల్స్ న్యూస్)** మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 1లో గాంధీ చిత్రపటానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ డైరెక్టర్ (యూబీడీ), మేనేజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీకి నివాళులర్పించారు.

# గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టాలి

## మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు
## మాధవరం నగర్ కాలనీలో గాంధీ జయంతి



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 2:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మాధవరం నగర్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు స్థానిక నాయకులతో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి, సహనం వంటి గాంధీజీ చూపిన విలువలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. స్వాతంత్ర్య సమరంలో ప్రజలను ఏకం చేసి అహింసా మార్గంలో నడిపించిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సత్యం, అహింస, స్వచ్ఛత, సామాజిక బాధ్యతను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు.

# గాంధీజీ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం

## సత్యం--అహింసా మార్గాలను ఆచరించాలి:
## సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్







**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో అక్టోబర్ 2 (పీపుల్స్ న్యూస్)** జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, క్రమశిక్షణ మార్గాలు నేటికీ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీ చేసిన త్యాగాలు, పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు న్యాయం చేయడం, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడం, సమాజ సేవకు అంకితభావంతో పనిచేయడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని తెలిపారు.గాంధీ కలలుగన్న స్వచ్ఛమైన, శాంతియుతమైన, సమానత్వ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని సీపీ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, హెడ్‌క్వార్టర్స్ అదనపు డీసీపీ షమీర్, హన్మంత్ రావుతో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్యలో శిక్షణ, గాంధీ జయంతి

## విజన్ బిల్డింగ్‌పై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన
## గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు



**నాగిరెడ్డిపేట,అక్టోబర్ 2 :** మండల సమాఖ్య కార్యాలయంలో ఎన్ఆర్ఎల్ఎం ఆధ్వర్యంలో మండల సమాఖ్య సభ్యులు, వీవోఏలు, సీసీలకు విజన్ బిల్డింగ్‌పై శిక్షణ నిర్వహించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్స్ కవిత, రమాదేవి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గాంధీ జయంతి సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ సత్యం, అహింస, స్వచ్ఛత, సేవా భావాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఏపీఎం దత్తు, సమాఖ్య అధ్యక్షురాలు శాంత సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మంజుల, సీసీలు, వీవోఏలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

# ఎస్సై అనిల్‌కుమార్ సూచన

## ఎల్లూరులో ప్రత్యేక గ్రామసభ



**కొమరం భీం, అక్టోబర్ 2**పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఎస్సై అనిల్‌కుమార్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి, మాజీ సర్పంచ్, ఐకేపీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యం

## క్షేత్రస్థాయిలో మల్కాజిగిరి పోలీసుల అప్రమత్తత












**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో అక్టోబర్ 2 (పీపుల్స్ న్యూస్)** ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పోలీసులు క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌తో పాటు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేస్తూ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు.అదేవిధంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత, నేరాల నియంత్రణలో వాటి ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ప్రజలతో మమేకమై, వారి భాగస్వామ్యంతో సురక్షితమైన సమాజ నిర్మాణానికి మల్కాజిగిరి పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని అధికారులు తెలిపారు.

# సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం

**పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది: సీపీ సుమతి**













**మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో అక్టోబర్ 2 (పీపుల్స్ న్యూస్)**
సీనియర్ సిటిజన్ల భద్రత, సమస్యల పరిష్కారానికి పోలీస్‌శాఖ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా ఉప్పల్‌లోని చిలుకానగర్‌లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్కా) ఆధ్వర్యంలో నిర్వహించిన చిలుకానగర్ డివిజన్ శాఖ ఆవిర్భావ సమావేశానికి సీపీ సుమతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా సీనియర్ సిటిజన్ల కార్యక్రమానికి తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక గుర్తింపు ఇస్తోందని, పోలీస్‌శాఖ కూడా వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పిస్తోందని తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీనియర్ సిటిజన్లకు అవసరమైన సహకారం, ప్రాధాన్యత అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీనియర్ సిటిజన్లు తమకు ఎదురయ్యే సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సమయంలో పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. సీనియర్ సిటిజన్ల భద్రతకు, వారి సమస్యల పరిష్కారానికి పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని సీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మార్వో ఫూల్ సింగ్ చౌహాన్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారెడ్డిలో జల అర్పణ దివస్ కార్యక్రమాలు

- హర్ ఘర్ జల్‌పై గ్రామస్థులకు అవగాహన
- గ్రామ సభలో అభివృద్ధి పనులపై చర్చ
- గాంధీ జయంతి సందర్భంగా నివాళులు



**నాగిరెడ్డిపేట, అక్టోబర్ 2 ):** మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో సర్పంచ్ గుల్లపల్లి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జల అర్పణ దివస్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ జల్ జీవన్ మిషన్, జల అర్పణ దివస్, హర్ ఘర్ జల్ కార్యక్రమాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి వ్యక్తిగత కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకం గురించి వివరించారు. అనంతరం వి.బి.-జి.ఆర్.ఎ.ఎం.జి. గ్రామసభ నిర్వహించి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉప సర్పంచ్ జయరాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముడుపులు అందకపోతే సీజ్..!

- పవిత్ర నర్సింగ్ హోమ్ నూతన భవనం.. సీజ్ చేయరా...?
- ప్రమాదాలు జరుగుతున్నా తనిఖీలు, చర్యలు ఎక్కడ?





**జూబ్లీహిల్స్, అక్టోబర్ 2 (పీపుల్స్ న్యూస్)**
నగరంలో నిర్మాణ దశలో ఉన్న భవనాలు ప్రమాదాలకు కేంద్రాలుగా మారుతున్నా.. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారుల్లో మాత్రం ఆశించిన స్థాయిలో అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బోరబండ, యూసఫ్‌గూడ ప్రాంతాల్లో చిన్నచిన్న స్థలాల్లోనే భారీ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. రహమత్ నగర్ చౌరస్తాకు సమీపంలో పవిత్ర నర్సింగ్ హోమ్ యజమాని ఆసుపత్రి పక్కనే ఐదు అంతస్తులు అక్రమ నిర్మాణం జరుగుతున్నప్పటికీ కేవలం అధికారులు నోటీసులకే పరిమితమయ్యారు. నిత్యం పదుల సంఖ్యలో కార్మికులు పనులు చేస్తూనే ఉన్నారు. ఎన్ని అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు స్థానికుల నుంచి వస్తున్నాయి. ఇటీవల యూసఫ్‌గూడ శ్రీ కృష్ణా నగర్ లో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కిందపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన నిర్మాణ ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలపై మరోసారి తీవ్ర ప్రశ్నలు లేవనెత్తింది. ప్రమాదం జరిగిన తర్వాతైనా అధికారులు మేల్కొని నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాలు, భవన అనుమతులు, నిర్మాణ విస్తీర్ణం, అంతస్తుల సంఖ్య తదితర అంశాలపై సమగ్ర తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ అక్రమ సంపాదన లక్ష్యంగా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

**డబ్బుల కోసం నిబంధనలు పక్కన పెడుతున్నారా?**
నిర్మాణ అనుమతులు, భవన నిబంధనలు, సెట్‌బ్యాక్‌లు, రోడ్డు వెడల్పు, ఫైర్ సేఫ్టీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో విఫలమైతే దాని ప్రభావం నేరుగా ప్రజలపైనే పడుతుంది. ముఖ్యంగా చిన్న చిన్న బస్తీల్లో ఉన్న ఇరుకైన రోడ్లలో అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తే అక్కడ నివసించే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వెనుక ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయంటూ వస్తున్న ఆరోపణలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన వ్యవస్థే మౌనం వహిస్తే.. సామాన్యుల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారు? అన్న ప్రశ్న ప్రజల నుంచి వినిపిస్తోంది. బస్తీల్లో ఇప్పటికే రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. వాటికి తోడు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం, నిర్మాణ సామగ్రిని రోడ్లపై ఉంచడం, పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది. సాధారణ సమయాల్లోనే వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉన్న ఈ రోడ్లలో అత్యవసర పరిస్థితి వస్తే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉంది. ఒకవేళ ఇలాంటి ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగితే ఫైర్ ఇంజిన్ సంఘటనా స్థలానికి చేరుకోవడం సాధ్యమేనా? ఇరుకైన రోడ్లు, అక్రమ నిర్మాణాలు, రోడ్లపై పార్కింగ్ కారణంగా భారీ వాహనాలకు మార్గం లేకపోతే అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకోలేని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. అదే సమయంలో ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఆసుపత్రికి తరలించాల్సి వస్తే అంబులెన్స్‌కు కూడా ఇదే సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. అత్యవసర సేవలకు మార్గం లేకపోవడం చిన్న సమస్య కాదు.. ఒక్కోసారి ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. నిర్మాణ దశలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల కార్మికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. భవనం నిర్మాణ సమయంలో ప్రమాదం జరిగిన తర్వాత హడావుడిగా నోటీసులు ఇవ్వడం, పనులు నిలిపివేయాలని ఆదేశించడం కంటే ముందుగానే తనిఖీలు నిర్వహించి ప్రమాదాలను నివారించడం మంచిదని ప్రజలు గుర్తు చేస్తున్నారు.

# గాంధీజీ సేవలు స్ఫూర్తిదాయకం




**టేకుమట్ల.అక్టోబర్ 02 ():** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని దుబ్యాల గ్రామంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను గ్రామ సర్పంచ్ సంగి అంజలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి,విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంగి అంజలి మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా గ్రామ స్వరాజ్యం,స్వచ్ఛత, గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బిక్కినేని కిషన్ రావు,మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి,వార్డు సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కపల్లిలో ఘనంగా గాంధీ జయంతి

**సత్యం, అహింస మార్గంలో నడవాలి: గణపురం వెంకన్న**



**కొమరం భీం, అక్టోబర్ 2** పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గణపురం వెంకన్న గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సముద్రాల రాజన్న, గణపురం నాగన్న, రాచకొండ కృష్ణ, రావుల కృష్ణ, రాచర్ల సత్యనారాయణ, పుల్లూరి రామన్న, రాచకొండ రాజు, శ్రీకృష్ణ, రామగిరి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మామునూరు విమానాశ్రయంకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

**తెలంగాణ ఇంటలేక్షువల్ ఫోరం డిమాండ్**

**హన్మకొండ, అక్టోబర్ 2:** తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో హన్మకొండ ప్రెస్ క్లబ్లో జర్నలిస్ట్ దామెర రవీందర్ అధ్యక్షతన దొడ్డి కొమురయ్య పేరును వరంగల్ మామునూరు విమానాశ్రయం కు పెట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి హాజరై మాట్లాడుతూ.... ప్రపంచంలోనే తెలంగాణ మట్టి మనుషులు చేసిన సాయుధ పోరాటం ఉద్యమాల చరిత్రలో ప్రాముఖ్యత సంతరించుకుంది 1946 జూలై 4న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో తుపాకీ గుళ్లకు ఎదురుగా నిలిచి దొడ్డి కొమరయ్య అమరత్వం పొందడం జరిగింది గుర్తుగా వరంగల్ మామునూరు ఎయిర్పోర్ట్ కు దొడ్డి కొమరయ్య పేరును పెట్టడం అమరవీరులకు మనం ఇచ్చే నివాళిగా ఇంటలెక్చువల్ ఫోరం భావిస్తుంది ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసిన రాజరికపు చరిత్రలు భూస్వామ్య దోపిడీ చరిత్రలో తెలంగాణ నిర్మాణాలకు అవసరం లేదని ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చిన వీరుల వీరుల పేర్లను పెట్టాలని తెలియజేయడం జరిగింది తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా వెట్టి చాకిరి విముక్తి అయింది ప్రజా రాజ్యాధికారం కోసం అనేక మంది వీరులు త్యాగం చేశారు చాకలి ఐలమ్మ షేక్ బందర్ కి షేపుల ఖాన్ దొడ్డు కొమురయ్య లాంటి అనేకమంది భూములు గుంజుకున్నా భూస్వాముల పేర్లు ప్రజా కార్లు దేశముఖల పేర్లు రాజరీక చరిత్ర పేర్లు తెలంగాణ ప్రాంతంలో కొనసాగడానికి వీలులేదని ఆత్మగౌరవం కోసం ప్రాణాలు ఇచ్చిన పీర్ల చరిత్ర ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని కులాలకు మతాలకు అతీతంగా దొడ్డు కొమురయ్య పేరు సమచితంగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది ప్రభుత్వం దొడ్డి కొమరయ్య పేరు పెట్టని పక్షంలో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయిందని ఈ సందర్భంగా హెచ్చరించడం జరిగింది ముఖ్యమంత్రి గతంలో ఒక సమావేశంలో దొడ్డి కొమురయ్య పేరును పెడతామని మాట్లాడడం జరిగింది ఇప్పుడు మాట మార్చితే తెలంగాణ బహుజన ప్రజల ఆగ్రహానికి గురిగావాల్సి వస్తుంది. కాబట్టి సాయుధ పోరాట అమరుల పేర్లు పెట్టాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాలని తెలియడం జరిగింది ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అజాద్ కడమంచి రాంబాబు ఐలయ్య మహేష్ పాణి శ్రావణ్ శివ తిరుపతి లింగయ్య శ్రీనివాస్ చార్వాక కోడల ప్రసాద్ రమేష్ ప్రభాకర్ విద్యార్థి ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు

# ఎన్నికల కమిషన్ తీరు.. కంచే చేను మేసినట్టుంది: కోదండరాం

**హైదరాబాద్, అక్టోబర్ 2:** కంచే చేను మేసినట్టు.. ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని టీజేఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. ఈసీ అక్రమాల నేపథ్యంలో అవకతవకలతో జరుగుతున్న 'సర్' ప్రక్రియను ఆపేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగం ఎన్నికల సంఘానికి స్వతంత్ర్య ప్రతిపత్తి కల్పించిందని.. కానీ కమిషన్ మాత్రం అధికారంలో ఉన్నవారు చెప్పినట్టు చేస్తోందని కోదండరాం ఆరోపించారు. ఈసీ.. సమావేశాలు నిర్వహించకుండా, రాజ్యాంగ విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన మండిపడ్డారు. ఇలా చేస్తే ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటాయన్నారు. ఓటు హక్కు ద్వారానే పౌరుల హక్కులను కాపాడగలమని.. అటువంటి ఓటుహక్కును ఎన్నికల కమిషన్ ఇష్టానుసారంగా తొలగిస్తోందని విమర్శించారు. అవకతవకలతో జరుగుతున్న 'సర్' ప్రక్రియను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో పని విధానం ఉండాలన్నారు. ప్రజల హక్కులకు భంగం కలిగితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# ముమ్మాటికి ప్రభుత్వ స్థలమే ..!

● అక్రమ నిర్మాణం రంగులు విద్దుకుంటుంది.

● మాజీ కార్పొరేటర్ మాయాజాలం..!

● సర్వే నంబర్ 329లో 283 గజాల స్థలంపై నిర్మాణం

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 2(పీపుల్స్ న్యూస్)**
ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులే ఆ భూమిపై నిర్మాణం జరుగుతుంటే ప్రేక్షకులుగా మిగిలిపోయారా? అన్న ప్రశ్నలు గాజులరామారం దేవేందర్‌నగర్‌లోని సర్వే నంబర్ 329ను చూసినప్పుడు తలెత్తుతున్నాయి. 283 గజాల స్థలం ప్రభుత్వ భూమి అని ప్రభుత్వ రికార్డులలో స్పష్టంగా ఉన్నప్పటికీ, అదే స్థలంలో భారీ నిర్మాణం కొనసాగడం ఎలా సాధ్యమైందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.నిర్మాణం ప్రారంభ దశ నుంచి టౌన్ ప్లానింగ్ అధికారులకు విషయం తెలిసినప్పటికీ కూడా వారు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోవడం వలన దశలవారీగా పెరుగుతూ ప్రస్తుతం భారీ భవనంగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు ఏమిటి? స్థలానికి సంబంధించిన హక్కు పత్రాలు ఏమిటి? ప్రభుత్వ భూమిలో నిర్మాణానికి ఏ ప్రాతిపదికన అనుమతి లభించింది? అనే అంశాల పట్ల టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**భూమి ప్రభుత్వానిది ..నిర్మాణం ఎవరి అనుమతితో?**
సర్వే నంబర్ 329లోని 283 గజాల స్థలం ప్రభుత్వ భూమి అని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ చర్యలు శూన్యం.ఈ అంశంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్మాణం ఆగకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇచ్చారు కానీ నిర్మాణ పనులను ఆపడంలో మాత్రం విఫలమయ్యారు. అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు తప్ప, ప్రభుత్వ భూమి అని తేలిన స్థలంలో వ్యక్తిగత నిర్మాణం ఎలా చేపట్టారు..?నిర్మాణదారుడి వద్ద ఆ భూమిపై యాజమాన్య హక్కులను తనిఖీ చేసే ప్రయత్నం చేశారా..? అనే ప్రశ్నలు ప్రజల్లో ఉన్నాయి. ప్రభుత్వ రికార్డులు స్పష్టంగా ప్రభుత్వ స్థలంగా నమోదయి ఉన్నప్పటికీ ఏకపక్షంగా టౌన్ ప్లానింగ్ అధికారులు సహకారం ఉండటంతో మాజీ కార్పొరేటర్ కు అక్రమ నిర్మాణం చేపట్టడం సులభతరమైందని ప్రజలు భావిస్తున్నారు






జీ4 నిర్మాణం వరకు ఎవరి దృష్టికీ రాలేదా?

భవనం ఒకటి రెండు అడుగులు వేసిన నిర్మాణం కాదు. జీ4 స్థాయికి చేరేంత వరకు నిర్మాణ పనులు సాగి పెంట్ హౌజ్ సైతం నిర్మాణం చేస్తుంటే అధికారులకు ఎందుకు కనబడలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇంత పెద్ద నిర్మాణం జరుగుతున్న ప్రాంతం అధికారుల పరిధిలోనే ఉన్నప్పటికీ, నిర్మాణం ఒక్కరోజులో పూర్తయ్యేది కాదని.. పునాదుల నుంచి ఒక్కో అంతస్తు నిర్మించే వరకు అనేక దశల్లో పనులు జరుగుతాయని స్థానికులు అంటున్నారు.ఈ వ్యవహారంలో ప్రస్తుతం కేవలం నిర్మాణం ఎంత ఎత్తుకు వెళ్లిందన్నది మాత్రమే కాకుండా, ఆ నిర్మాణానికి చట్టబద్ధమైన ప్రాతిపదిక ఉందా లేదా అన్నదే ప్రధాన అంశంగా మారింది.అధికారులు కింది అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.ప్రజల ముందు రికార్డులు పెడితే అనుమానాలకు తెర పడే అవకాశం ఉంది.సర్వే నంబర్ 329పై వస్తున్న ఆరోపణలకు తెరపడాలంటే అధికారుల నుంచి స్పష్టమైన ప్రకటన రావాల్సిందేనని స్థానికులు చెబుతున్నారు. భూమి ప్రభుత్వానిదేనా? కాదా? అనే విషయాన్ని అధి కారిక రికార్డులతో తేల్చడంతో పాటు నిర్మాణ అనుమతులు, ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలను కూడా వెల్లడించాలని కోరుతున్నారు.

# ప్రయాణికుల సేవలో ఆర్టీసీ బస్ స్టేషన్ టీం..!



**జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 2)**
జగిత్యాల ఆర్టీసీ కి ఓ ప్రయాణికుని ఉత్తర..!నేను సిరిమల్లె ప్రవీణ్ కాజీపేట్.. వరంగల్ బస్టాండ్ లో అక్టోబర్ 2 ఉదయం జగిత్యాల డిపో డీలక్స్ బస్సు ఎక్కాను.. ప్రయాణం చేస్తూ హుజురాబాద్ బస్ స్టేషన్ లో వాష్ రూమ్ వెళ్లి వచ్చేవరకు బస్సు వెళ్ళిపోయింది. నాకు సంబందించిన రూ 80000 రూపాయలు, సెల్ ఫోన్ గల పర్సు తీసుకున్న టికెట్టు కూడా బ్యాగు కూర్చున్న సీట్ లో ఉండిపోయింది. ప్యాసింజర్ టిక్కెట్టు లేనందున డీలక్స్ ఏ డిపో అని మాత్రం తెలియదు హుజురాబాద్ నుండి నిజామా బాద్ వెళ్లే డీలక్స్ వివరాల కోసం స్టేషన్ కు కాల్ చేశాను డిపో మేనేజర్ రమేష్ అనుమతితో ప్రతి డీలెక్స్ బస్సు ను జగిత్యాల ఆర్టీసీ బస్టాండ్ టీం తనిఖీ చేశారు. చివరి ప్రయత్నంలో ఒక డీలక్స్ లో నా బ్యాగ్ ను టీమ్ పట్టుకుంది. చెప్పిన బ్యాగ్ మనీ పర్స్ సెల్లు దొరికినది. టీమ్ కాల్ చేసింది అందరి ముందు అందులో ఉన్న వస్తువులు వీడియో తీశారు నేను వెళ్ళాను నా రూ 80,000 రూపాయలు సెల్, పర్సులో నగదు రూపాయలు బ్యాగు అందులో ఉన్న వస్తువులు అప్పాజెప్పారు. నా కండ్లల్లో ఆనంద భాష్పాలు తోఇంత చక్కటి టీం వర్క్ చేసినందుకు జగిత్యాల బస్ స్టేషన్ టీంకు కృతజ్ఞతలు.

## వృద్ధాశ్రమానికి విశ్రాంత విద్యుత్ ఇంజనీర్ల విరాళం రూ.50 వేలు అందజేత



**కరీంనగర్ జిల్లా :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా విశ్రాంత విద్యుత్ ఇంజనీర్ల సంఘం జగిత్యాల సమీపంలో విశ్వకర్మ సంక్షేమ సంఘం నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి రూ.50వేలు విరాళం చెక్కు ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి కే. లక్ష్మయ్య మాట్లాడుతూ 22 సంవత్సరాల నుండి ప్రతీ ఏటా అనాథలకు, వృద్ధులకు రూ. 8 లక్షలు సహాయం అందించామని, ఇంకా 12 లక్షల బ్యాంకు డిపాజిట్లు నిర్వహిస్తూ భవిష్యత్ అవసరాలకు నిల్వ ఉంచామని తెలిపారు.సంఘ అధ్యక్షులు, ఎన్పీడీసీఎల్ మాజీ డైరెక్టర్ పి.గణపతి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో సంప్రదిస్తే అనాథల సంక్షేమం కొరకు మరిన్ని విరాళాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.
వృద్ధులు, అనాథలకు పండ్లు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో రెడ్కో జిల్లా మేనేజర్ మనోహర్, ఏడీఈ వరుణ్ కుమార్, ఏఈలు సుందర్, అశోక్ రెడ్డి, విశ్రాంత ఇంజనీర్లు ఆనందరావు, గోపాలరెడ్డి, సదాశివరెడ్డి, గణేష్, వృద్ధాశ్రమం నిర్వాహకులు టీవీ సూర్యం, ముమ్మాడి నాగభూషణశీ బెజ్జంకి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# జాతీయ ప్రతినిధుల సదస్సుని విజయవంతం చెయ్యండి.

## ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్

**మేడిపల్లి : ప్రతినిధి కె,శ్రవణ్ కుమార్ అక్టోబర్ 2 (పీపుల్స్ న్యూస్)**
అక్టోబర్ 06న ఉస్మానియా యూనివర్సిటీ లో జరిగే యమ్ఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సదస్సుని విజయవంతం చెయ్యాలని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ పిలుపునిచ్చారు. మేడిపల్లి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కాటపాక అభిషేక్ మాదిగ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో పాల్గొన్న జిల్లా మాజీ అధ్యక్షుడు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయత్వంలో జరిగే సదస్సు యమ్ఎస్ఎఫ్ ప్రతినిధుల జాతీయ సదస్సుగానే మనం ప్రకటించినప్పటికీ మనం జరిపే సదస్సు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ లోనే కాకుండా జాతీయ స్థాయిలో పాలకులను, అన్ని విద్యార్థి సంఘాలను అత్యంత ప్రభావితం చేసేలా ఉండాలన్నారు. అణగారిన వర్గాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై శంకరావం మోగించే బలమైన విద్యార్థి శక్తిగా మనం జరిపే సదస్సు కనిపించాలని, అది పీడిత వర్గాల విద్యార్థులను నిర్లక్ష్యం చేసే పాలక పక్షాలకు ఒక హెచ్చరికగా ఉండాలన్నారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు ఒక బలమైన కేంద్రంగా,యమ్ఎస్ఎఫ్ మరియు ఎమ్మెస్పీ భవిష్యత్తు లో కనిపించేలా ఉండాలని, చాలా గొప్పగా



సదస్సు జరిగి తీరాలని, అందుకోసం మేడిపల్లి నుండి పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బండారి సాయి మాదిగ , మైసగాళ్ళ శివ మాదిగ, కూతాడి సంపత్ ,మండల ప్రధానకార్యదర్శి శివ , ల ఉపాధ్యక్షులు ఉపేంద్ర ,విక్రమ్ , రాహుల్ పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## - మంథని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.వి. నాయక్




**మంథని, అక్టోబర్ 2:** వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మంథని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.వి. నాయక్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి డి ఎఫ్ ఓ ఆదేశాల మేరకు మంథని ఎఫ్ ఆర్ ఓ ఎం.వి. నాయక్ ఆధ్వర్యంలో ఖాన్సాయిపేట, భట్ పల్లి గ్రామాల్లో కార్డాన్ సెర్చ్, రైడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో వన్యప్రాణి వారోత్సవాల పై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. అడవులను నరకడం, వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని, అటవీ సంపదను కాపాడడం లో ప్రజలు భాగస్వాములు కావాలని ఎఫ్ఆర్ఓ నాయక్ పిలుపునిచ్చారు. అనంతరం శివ్వారం వన్యప్రాణి అభయారణ్యంలో క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఏక్లాస్ పూర్ అటవీ ప్రాంతంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎఫ్ ఆర్ ఓ టి. సతీష్ కుమార్ తో పాటు మంథని, పెద్దపల్లి రేంజ్ ల డిప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

## అదనపు కలెక్టర్ సంపత్‌రావు

## ములుగులో ఘనంగా గాంధీ జయంతి

**ములుగు, అక్టోబర్ 2 (**
మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జీవితంలోని ముఖ్య ఘట్టాలను అధికారులు స్మరించుకున్నారు. సత్యం, అహింసలను ఆయుధాలుగా చేసుకొని స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని సంపత్‌రావు



పేర్కొన్నారు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ద్వారా ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమం వైపు నడిపించారని, కులమతాలకు అతీతంగా సమా నత్వాన్ని చాటిచెప్పారని తెలిపారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, డీఐఓ అప్పలనాయుడు, జీఎం ఇండస్ట్రీస్ సిద్ధార్థరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ధర్మానాయక్, డీపీఆర్వో రఫీక్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మహేష్‌బాబు, ఈడీఎం దేవేందర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా విజయవాడ జిల్లా కారాగారంలో ఘనంగా "ఖైదీల సంక్షేమ దినోత్సవం"

- గాంధీజీ సత్యం, అహింస మార్గాలను అలవర్చుకోవాలి....
- అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి శ్రీ ఎం. సునీల్ కుమార్
- ఆర్థిక ప్రయోజనాల కోసం చేయని నేరాలను నెత్తికెత్తుకోవద్దు....
- ఖైదీలకు న్యాయమూర్తి హితవు



**విజయవాడ, 02.10.2026 :** మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా కారాగారంలో "ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ అడిషనల్ డిస్ట్రిక్ట్ ఢ సెషన్స్ జడ్జి శ్రీ ఎం. సునీల్ కుమార్ హాజరయ్యారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో న్యాయమూర్తి ఎం. సునీల్ కుమార్ గారు మాట్లాడుతూ... ఖైదీలలో నిజమైన పరివర్తన రావాలంటే గాంధీజీ బోధించిన సత్యం, అహింస సిద్ధాంతాలను జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక మార్గాలకు దూరంగా ఉంటూ, కేవలం ఆర్థిక లాభాల కోసం ఇతరులు చేసిన నేరాలను తమ నెత్తిపై వేసుకోవద్దని స్పష్టం చేశారు. జైలు జీవితాన్ని సత్ప్రవర్తన అలవర్చుకునే అవకాశంగా మార్చుకోవాలని, జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకుని పరిపూర్ణ వ్యక్తులుగా సమాజంలోకి అడుగుపెట్టాలని ఉదాహరణలతో వివరించారు. అనంతరం గౌరవ న్యాయమూర్తి కారాగార ప్రాంగణాన్ని సందర్శించి, అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని కారాగార పర్యవేక్షణాధికారి శ మహమ్మద్ ఇర్ఫాన్ ఘనంగా సత్కరించారు. సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖైదీల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వివిధ క్రీడా, వ్యాస రచన తదితర పోటీలలో ప్రతిభ కనబరిచిన ఖైదీలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లీగల్ అడ్వకేట్లు, సోషల్ వర్కర్లు, జిల్లా కారాగార వైద్యాధికారి శ్రీ రోషన్ మియాన్, జైలర్లు ఎన్. గణేష్, సిహెచ్. వేణు, డిప్యూటీ జైలర్ బి. గోపయ్య నాయక్ మరియు కారాగార సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహాత్మా గాంధీ సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలి

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

- గాంధీజీ ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది



**విజయవాడ: అక్టోబర్ 2, 2026 :** జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సమానత్వం, స్వచ్ఛత వంటి ఉన్నతమైన ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం మరింత బలోపేతం అవుతాయని అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి అందించిన అపూర్వ సేవలను, స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. భారతదేశ స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మా గాంధీ అనుసరించిన సత్యాగ్రహం, అహింసా మార్గాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో చైతన్యం నింపడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని అన్నారు. గాంధీజీ బోధించిన సత్యం, అహింస, స్వచ్ఛత, సామాజిక సమానత్వం, మానవతా విలువలు నేటి సమాజానికి కూడా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ విలువలను చిన్ననాటి నుంచే పిల్లలకు, యువతకు పరిచయం చేసి, వాటిని ఆచరణలో పెట్టేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా జీవనంలో నిజాయితీ, బాధ్యత, క్రమశిక్షణ, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల గౌరవం, సహనం, మానవతా దృక్పథంతో వ్యవహరించడం ద్వారా గాంధీజీ కలలుగన్న సమాజ నిర్మాణానికి దోహదపడగలరని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, ప్రజా ప్రదేశాల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. గాంధీజీ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను సానుభూతితో, బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# అధిక శబ్దాలకు తరచూ గురవుతుంటే శరీరంపై ప్రభావం పడుతుందా నిపుణులు ఏమంటున్నారు



మన చుట్టూ ఉండే శబ్దాలకు శరీరం క్రమంగా అలవాటు పడుతుంది. ట్రాఫిక్, నిర్మాణ పనులు, పెద్ద శబ్దంతో సంగీతం, రద్దీగా ఉండే ప్రదేశాలు, క్రీడా కార్యక్రమాలు వంటి వాటికి తరచూ గురవుతుంటే కొంతకాలానికి అవి సాధారణంగానే అనిపిస్తాయి. అయితే శబ్దానికి అలవాటు పడడం అంటే అది ఆరోగ్యానికి మేలని అర్థం కాదు. అధిక శబ్దం పర్యావరణ ఆరోగ్యానికి ముప్పుగా మారుతుంది. ముఖ్యంగా ఎక్కువ శబ్దానికి పదేపదే గురికావడం వల్ల వినికిడి సమస్యలతోపాటు గుండె ఆరోగ్యం, రక్తపోటు, నిద్ర వంటి వాటిపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. చెవులపై అధిక ప్రభావం..

అధిక శబ్దం వల్ల మొదటగా ప్రభావితమయ్యేది చెవులే. పెద్ద శబ్దాలు లోపలి చెవిలోని సున్నితమైన ఇంద్రియ కణాలను దెబ్బతీయడం ద్వారా శాశ్వత వినికిడి లోపానికి దారితీస్తుంది. చెవుల్లో నిరంతరం లేదా తరచూ గంట మోగుతున్నట్లుగా అనిపించడం, అంటే టిన్నిటస్ కూడా శబ్దానికి ఎక్కువగా గురికావడం వల్ల ఏర్పడే సాధారణ సమస్యల్లో ఒకటి. అయితే శబ్ద కాలుష్యం ప్రభావం చెవులకే పరిమితం కాదు. అధిక శబ్దం శరీరంలో ఒత్తిడి ప్రతిస్పందనను పెంచి గుండె వేగం, రక్తపోటు వంటి శారీరక ప్రక్రియలను ప్రభావితం చేస్తాయి. నిద్రకు అంతరాయం కలిగించడం ద్వారా కూడా శరీరంపై ఒత్తిడిని పెంచుతుంది. ఎక్కువ కాలం ట్రాఫిక్ శబ్దానికి గురికావడం అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, పక్షవాతం, టైప్-2 మధుమేహం వంటి సమస్యలతో సంబంధం ఉన్నట్లు అధ్యయనాలు సూచించాయి.సమయం, తీవ్రతపై ఆధారపడి..

శబ్దం వల్ల కలిగే ప్రమాదం దాని తీవ్రతతో పాటు ఎంతసేపు, ఎంత దగ్గరగా దానికి గురవుతున్నామనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. బాణసంచా లేదా తుపాకీ కాల్పుల వంటి అత్యంత పెద్ద శబ్దాలు చాలా తక్కువ సమయంలోనే వినికిడిని దెబ్బతీస్తాయి. మరోవైపు పవర్ టూల్స్, పెద్ద శబ్దంతో సంగీతం, భారీ ట్రాఫిక్ వంటి వాటికి ఎక్కువసేపు గురికావడం వల్ల నష్టం క్రమంగా పేరుకుపోతుంది. వృత్తిపరమైన శబ్దానికి సంబంధించి ఎనిమిది గంటల వ్యవధిలో సగటున 85 డెసిబెల్స్ పరిమితిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ప్రతి 3 డెసిబెల్స్ పెరుగుదలతో సురక్షితమైన ఎక్స్‌పోజర్ సమయం సగానికి తగ్గుతుంది. రోజులో వివిధ సమయాల్లో ఎదురయ్యే శబ్దాలు కూడా కలిపి మొత్తం శబ్ద ప్రభావాన్ని పెంచుతాయి.

ఏం చేయాలి.. శబ్ద కాలుష్యం నుంచి రక్షించుకోవడానికి శబ్దాన్ని పూర్తిగా దూరం చేసుకోవాల్సిన అవసరం లేదు. రోజువారీ శబ్దానికి గురయ్యే సమయాన్ని తగ్గించడం ముఖ్యం. వీలైనప్పుడు తక్కువ శబ్దం ఉన్న ప్రదేశాలు, పరికరాలను ఎంచుకోవాలి. పెద్ద శబ్దం ఉన్న ప్రదేశాల్లో కొంతసేపు విరామం తీసుకోవడం, అవసరమైనప్పుడు చెవి రక్షణ పరికరాలు ఉపయోగించడం మంచిది. హెడ్‌ఫోన్లలో శబ్దాన్ని తక్కువ స్థాయిలో ఉంచడం, పెద్ద శబ్దం వచ్చే స్పీకర్లకు దూరంగా ఉండడం, పవర్ టూల్స్ ఉపయోగించేటప్పుడు చెవి రక్షణ ధరించడం వంటి చర్యలు సహాయపడతాయి. అయితే శబ్ద కాలుష్యాన్ని పూర్తిగా తగ్గించడానికి వ్యక్తిగత జాగ్రత్తలతోపాటు ప్రజా స్థాయిలో కూడా చర్యలు అవసరం. తక్కువ శబ్దం చేసే పరికరాల తయారీ, భవనాల రూపకల్పనలో శబ్ద నియంత్రణ, రవాణా శబ్దాన్ని తగ్గించే పట్టణ ప్రణాళిక, కార్యాలయాల్లో శబ్ద నియంత్రణ వంటి చర్యలు ప్రజారోగ్యాన్ని కాపాడడ

# సాధారణ దగ్గు, జలుబు, కోవిడ్‌ల మధ్య లక్షణాలు ఎలా ఉంటాయి ఎలా గుర్తించాలి



చలికాలం ప్రారంభమయ్యే సమయంలో కోవిడ్-19, ఆర్ఎస్వీ, ఫ్లూ, సాధారణ జలుబు వంటి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా కనిపిస్తాయి. వీటిలో చాలా వ్యాధుల లక్షణాలు ఒకేలా ఉండడంతో పిల్లలకు వచ్చిన ఇన్‌ఫెక్షన్ ఏదో గుర్తించడం కొన్నిసార్లు కష్టంగా ఉంటుంది. దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపించినప్పుడు పిల్లలను స్కూల్‌కు పంపించాలా, ఇంట్లోనే ఉంచాలా అనే సందేహం తల్లిదండ్రులకు వస్తుంది. అనారోగ్యంగా ఉన్న పిల్లలను స్కూల్‌కు పంపించడం వల్ల వారు కోలుకోవడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండడంతో పాటు, తోటి విద్యార్థులకు, సిబ్బందికి కూడా ఇన్‌ఫెక్షన్ వ్యాపించే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఈ ఇన్‌ఫెక్షన్లు తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది. వైరస్‌ల వచ్చే దగ్గు, జలుబు..

సాధారణ జలుబు వివిధ రకాల వైరస్‌ల వల్ల వస్తుంది. దగ్గు, తుమ్ములు, గొంతు నొప్పి, ముక్కు కారడం వంటి లక్షణాలు సాధారణంగా కనిపిస్తాయి. ఇవి ఎక్కువగా స్వల్పంగా ఉండి, దాదాపు 7 నుంచి 10 రోజుల్లో తగ్గిపోతాయి. కోవిడ్-19 మాత్రం సార్స్-కోవ్-2 అనే వైరస్ వల్ల వస్తుంది. దీని లక్షణాలు సాధారణంగా 7 నుంచి 14 రోజుల వరకు ఉంటాయి. కొందరిలో మూడు నుంచి నాలుగు వారాల వరకు కొనసాగుతాయి. దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడంతోపాటు శరీర నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తలనొప్పి, అలసట, జ్వరం, రుచి లేదా వాసన కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు వంటి జీర్ణవ్యవస్థకు సంబంధించిన లక్షణాలు కూడా కొందరిలో కనిపించే అవకాశం ఉంది.ఫ్లూ లక్షణాలు అయితే.. ఫ్లూ లక్షణాలు సాధారణ జలుబు లేదా కోవిడ్‌తో పోలిస్తే అకస్మాత్తుగా మొదలయ్యే అవకాశం ఉంది. ఇవి సాధారణంగా 3 నుంచి 7 రోజుల పాటు కొనసాగుతాయి. కోవిడ్‌లో కనిపించే కొన్ని లక్షణాలు ఫ్లూలోనూ ఉంటాయి. అయితే రుచి లేదా వాసన కోల్పోవడం సాధారణంగా ఫ్లూ లక్షణంగా కనిపించదు. ఆర్ఎస్వీ లక్షణాలు జలుబును పోలి ఉన్నప్పటికీ, ఆకలి తగ్గడం కూడా కనిపిస్తుంది. ఇది ఊపిరితిత్తులను ప్రభావితం చేసి ముఖ్యంగా చిన్నారులు, శిశువుల్లో తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, ఆసుపత్రిలో చేరే పరిస్థితికి దారితీస్తుంది. దీని లక్షణాలు మూడు నుంచి నాలుగు వారాల వరకు కొనసాగుతాయి. అందువల్ల వైరస్ ఏదో కచ్చితంగా తెలియకపోయినా, అనారోగ్యంగా ఉన్న పిల్లలను ఇంట్లో ఉంచడం ద్వారా ఇతరులకు వ్యాధి వ్యాప్తిని తగ్గించవచ్చు.

జాగ్రత్తలు ముఖ్యం.. పిల్లలను స్కూల్‌కు పంపాలా వద్దా అనే విషయంలో వారు తరగతి గదిలో సాధారణ కార్యకలాపాల్లో సౌకర్యంగా పాల్గొనగలరా అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. అయితే గత 24 గంటల్లో జ్వరం వచ్చినా, విరేచనాలు, వికారం లేదా వాంతులు ఉన్నా పిల్లలను స్కూల్‌కు పంపకుండా ఇంట్లో విశ్రాంతి ఇవ్వడం మంచిదని సూచిస్తున్నారు. లక్షణాలను బట్టి మాత్రమే కోవిడ్‌ను గుర్తించడం చాలా సందర్భాల్లో సాధ్యం కాదు. అనుమానం ఉంటే ఇంట్లో కోవిడ్ పరీక్ష చేయవచ్చు. పరీక్ష పాజిటివ్‌గా వస్తే ఫలితం సాధారణంగా నమ్మదగినదే అయినప్పటికీ, నెగెటివ్ ఫలితం వచ్చినంత మాత్రాన ఇన్‌ఫెక్షన్ లేదని పూర్తిగా నిర్ధారించలేం.

లక్షణాలు కొనసాగితే 48 గంటల తర్వాత మళ్లీ పరీక్ష చేయడం లేదా వైద్యుల సూచన మేరకు పీసీఆర్ పరీక్ష చేయించుకోవచ్చు. కోవిడ్, ఫ్లూ టీకాలను ఆరు నెలలు దాటిన పిల్లలకు, వైద్యపరంగా ఎలాంటి అభ్యంతరాలు లేనప్పుడు ఇవ్వాలని సంబంధిత వైద్య సంస్థలు సూచిస్తున్నాయి. టీకా తీసుకున్న తర్వాత కూడా ఇన్‌ఫెక్షన్ వచ్చే చాన్స్ ఉంటుంది, కానీ తీవ్రమైన అనారోగ్యం,

ఆసుపత్రిలో చేరే ప్రమాదాన్ని తగ్గించడంలో టీకాలు సహాయప డతాయి. సాధారణంగా చాలా మంది పిల్లలు ఇంట్లోనే కోలుకుంటారు. అయితే మందుల తోనూ జ్వరం తగ్గకపోవడం, తినడం లేదా తాగడంలో ఇబ్బంది, శ్వాస తీసుకోవడంలో సమస్యలు వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం తీసుకోవాలి.

# ఈ మసాలాలను ఎంతో రుచిగా ఇంట్లోనే తయారు చేయవచ్చు కొనాల్సిన పనిలేదు



వంటలకు రుచి, సువాసన తీసుకురావడంలో మసాలాలకు ప్రత్యేకమైన పాత్ర ఉంటుంది. బిర్యానీ, సాంబార్, పప్పు, కూరలు వంటి వంటకాల కోసం చాలామంది మార్కెట్‌లో లభించే ప్యాకెట్ మసాలాలపై ఆధారపడుతుంటారు. అయితే ప్యాకెట్ తెరిచిన తర్వాత గాలి, తేమకు గురికావడం వల్ల వాటి సువాసన, నాణ్యత తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే ఇంట్లో అందుబాటులో ఉండే సంపూర్ణ మసాలా దినుసులతో తాజా మసాలాలను తయారు చేసుకోవడం మంచి ప్రత్యామ్నాయం. ఇంట్లో తయారు చేసుకునే మసాలాల్లో ఉపయోగించే పదార్థాల నాణ్యత, తాజాదనాన్ని మనమే నియంత్రించుకోవచ్చు. ముందుగానే తయారు చేసి గాలి చొరబడని డబ్బాల్లో భద్రపరుచుకుంటే అవసరమైనప్పుడు సులభంగా ఉపయోగించుకోవచ్చు. ఇంట్లో సులభంగా చేసుకోదగిన కొన్ని మసాలాల గురించి వంట నిపుణులు వివరిస్తున్నారు. గరం మసాలా, చాట్ మసాలా.. గరం మసాలా తయారీకి 2 టేబుల్‌స్పూన్ల ధనియాలు, ఒక టేబుల్‌స్పూన్ జీలకర్ర, ఒక టీ స్పూన్ మిరియాలు, 4-5 పచ్చి యాలకులు, 2 నల్ల యాలకులు, ఒక ఇంచు దాల్చిన చెక్క, 4-5 లవంగాలు, ఒక బిర్యానీ ఆకు తీసుకోవాలి. వీటన్నింటినీ తక్కువ మంటపై 2-3 నిమిషాలు పొడిగా వేయించి సువాసన వచ్చిన తర్వాత పూర్తిగా చల్లార్చాలి. అనంతరం మెత్తగా పొడి చేసి గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవాలి. చాట్ మసాలా కోసం 2 టేబుల్‌స్పూన్ల జీలకర్ర, ఒక టేబుల్‌స్పూన్ ధనియాలు, ఒక టేబుల్‌స్పూన్ నల్ల ఉప్పు, ఒక టీ స్పూన్ సాధారణ ఉప్పు, ఒక టీ స్పూన్ మిరియాలు, ఒక టీ స్పూన్ ఆమ్‌చూర్ పొడి, అర టీ స్పూన్ అల్లం పొడి తీసుకోవాలి. జీలకర్ర, ధనియాలను వేయించి చల్లారిన తర్వాత పొడి చేసి మిగతా పదార్థాలతో కలిపి పొడి డబ్బాలో భద్రపరచాలి.మంచి ప్రత్యామ్నాయం. ఇంట్లో తయారు చేసుకునే మసాలాల్లో ఉపయోగించే పదార్థాల నాణ్యత, తాజాదనాన్ని మనమే నియంత్రించుకోవచ్చు. ముందుగానే తయారు చేసి గాలి చొరబడని డబ్బాల్లో భద్రపరుచుకుంటే అవసరమైనప్పుడు సులభంగా ఉపయోగించుకోవచ్చు.సాంబార్ మసాలా ..దక్షిణ భారతీయ సాంబార్ మసాలా కోసం 2 టేబుల్‌స్పూన్ల ధనియాలు, ఒక టేబుల్‌స్పూన్ శనగపప్పు, ఒక టేబుల్‌స్పూన్ మినపపప్పు, ఒక టీ స్పూన్ జీలకర్ర, 8-10 ఎండు మిరప కాయలు, అర టీ స్పూన్ మెంతులు, 8-10 కరివేపాకులు తీసుకోవాలి. వీటిని ఒక్కొక్కటిగా బంగారు రంగు వచ్చే వరకు వేయించి పూర్తిగా చల్లారిన తర్వాత మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ మసాలాలను సాంబార్‌తో పాటు ఇతర దక్షిణ భారతీయ వంటల్లోనూ ఉపయోగించవచ్చు. కూరల కోసం సబ్జీ మసాలా తయారు చేయాలంటే 2 టేబుల్‌స్పూన్ల ధనియాలు, ఒక టేబుల్‌స్పూన్ జీలకర్ర, ఒక టీ స్పూన్ సోంపు, ఒక టీ స్పూన్ పసుపు, ఒక టీ స్పూన్ కారం, ఒక టీ స్పూన్ మిరియాలు, 4 లవంగాలు, ఒక ఇంచు దాల్చిన చెక్క తీసుకోవాలి. ధనియాలు, జీలకర్ర, సోంపు, మిరియాలు, లవంగాలు, దాల్చిన చెక్కలను వేయించి చల్లారిన తర్వాత పొడి చేసి పసుపు, కారం కలపాలి.

# పీవీ సింధు చేసిన ఈ వ్యాయామం దీని వల్ల ఎలాంటి లాభాలు



బ్యాడ్మింటన్ స్టార్ పీ.వీ. సింధు ఇటీవల తన వ్యాయామ సాధనకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ఇందులో ఆమె ఒక కాలితో చేసే హిప్ థ్రస్ట్ లేదా సింగిల్ లెగ్ గ్లూట్ బ్రిడ్జ్ తరహా వ్యాయామం చేస్తున్నట్లు కనిపించింది. పైభాగాన్ని బెంచ్‌పై ఆనించి, ఒక కాలును ఎత్తైన ఉపరితలంపై ఉంచి శరీరాన్ని నియంత్రణతో కదిలించారు. చూడడానికి సులభంగా కనిపించినప్పటికీ, ఒకేసారి ఒక వైపు శరీర భాగానికి పని కల్పించే ఇలాంటి వ్యాయామాలు కండరాల బలంత పాటు సమతుల్యత, స్థిరత్వం, శరీర నియంత్రణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అలాగే ఎడమ, కుడి వైపుల మధ్య బలంలో ఉన్న తేడాలను గుర్తించడానికి కూడా ఇవి ఉపయోగపడతాయి.కాళ్ల బలం పెరిగేందుకు.. బ్యాడ్మింటన్‌లో తరచూ లంజ్‌లు చేయడం, వేగంగా దిశ మార్చడం, దూకడం, శక్తివంతమైన కదలికలు చేయడం, ఒక కాలిపై ల్యాండ్ అవడం వంటి కదలికలు ఉంటాయి. అందుకే కాళ్ల బలంతోపాటు శరీర స్థిరత్వం, సమన్వయం పెంచే వ్యాయామాలు క్రీడాకారులకు ఉపయోగపడతాయి. అయితే ఇలాంటి వ్యాయామాల ప్రయోజనాలను పొందాలంటే క్రీడాకారుల స్థాయిలో శిక్షణ తీసుకోవాల్సిన అవసరం లేదు. ఒక కాలితో చేసే వ్యాయామాలను ప్రారంభంలో శరీర బరువుతోనే చేయవచ్చు. సరైన పద్ధతిలో, నియంత్రణతో చేయడం అలవాటైన తర్వాత క్రమంగా ప్రతిఘటనను పెంచుకోవాలి. రెండు కాళ్లతో సైతం..

ఒక కాలితో చేసే వ్యాయామాలు సాధారణంగా రెండు కాళ్లతో చేసే స్క్వాట్లు లేదా డెడ్‌లిఫ్ట్‌లలో స్పష్టంగా కనిపించని బలహీనతలను గుర్తించడంలో సహాయపడతాయి. వీటిలో శరీరాన్ని సరైన స్థితిలో ఉంచుతూ కదలికను నియంత్రించాల్సి ఉంటుంది. అయితే ఒక కాలితో చేసే వ్యాయామాలే ఎప్పుడూ మెరుగైనవని కాదు. రెండు కాళ్లతో చేసే వ్యాయామాలకు కూడా బలం పెంచే సాధనలో ముఖ్యమైన స్థానం ఉంది. కాళ్ల వ్యాయామాల్లో స్క్వాట్లు, స్ప్లిట్ స్క్వాట్లు, హిప్ హింజ్ కదలికలు, గ్లూట్ వ్యాయామాలు, కాలి కండరాల సాధనతోపాటు నియంత్రిత సింగిల్ లెగ్ వ్యాయామాలను చేర్చుకోవాలి సింధు సాధన నుంచి నేర్చుకోవాల్సిన ప్రధాన విషయం ఆమె చేసిన నిర్దిష్ట వ్యాయామం మాత్రమే కాదు.

శరీరం కదిలే విధానానికి అనుగుణంగా బలాన్ని పెంచుకోవడం కూడా ముఖ్యమే. వ్యాయామం చేసేటప్పుడు బరువు లేదా పునరావృతాల సంఖ్య పెంచడమే లక్ష్యం గా పెట్టుకోకుండా సరైన పద్ధతి, నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాలి. శరీర నియంత్రణ కోల్పోయే స్థాయిలో ఎక్కువ బరువు ఉపయోగించడం వల్ల ప్రయోజనం కంటే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# రైతన్నలకు రాజముద్ర పుస్తకం భరోసా

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు**

- బి రాజేరులో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ
- పల్లె పండగ 3.0 కార్యక్రమం
- ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పల్లెలకు ప్రాధాన్యం
- శాఖల వారిగా అధికారులతో సమీక్ష



**గజపతినగరం, బొండపల్లి, అక్టోబర్ 2 :** రైతన్నలకు రాజముద్ర పుస్తకం భరోసాను కలిగిస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బొండపల్లి మండలం బి రాజేరు గ్రామంలో 875 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్ర తో కూడిన పాస్ పుస్తకాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమానికి ముందు బి రాజేరు గ్రామంలో 3.0 పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 61.5 లక్షల రూపాయలతో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. పల్లెటూర్లే పట్టణాలకు పట్టుకొమ్మలని, అందుకే పల్లెలను అభివృద్ధి పరచటానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా పల్లె పండుగను నిర్వహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పల్లెలకు ప్రత్యేకమైన ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద జరిగిన సమావేశంలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యక్రమాలను పరిశీలించారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల ఆవిష్కరించారు శాఖల వారీగా అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రైతుల ఫోటోల స్థానంలో జగన్ రెడ్డి ఫోటో వేసుకోవడంతో రైతులు ఆందోళన చెందారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీ సర్వే చేయించి ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందించడంతో రైతుల్లో ధైర్యం కలిగిందన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో 875 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడం జరిగిందని, ఫోటో వివరాలు, వ్యక్తిగత వివరాలు, సరిహద్దు వివరాలు సరిచూసుకొని తప్పులు ఉన్నట్లయితే రెవిన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు. ఎలినీనో ప్రభావంతో రైతులకు వరి వేసే సమయం ముగిసిందని, పెసర, మినుము వంటి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత కాలానుకూలంగా ఆర్ఎన్ఆర్ వరి రకం మాత్రమే సాగు చేయటానికి వీలు పడుతుందని, అవసరమైతే రైతన్నల కోరిక మేరకు ఆ విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగులు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను సకాలంలో అందించాలని ఆదేశించారు. గ్రామంలో వీధిలైట్లు సమస్యను విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తప్పనిసరిగా ప్రస్తుతం 14 సంవత్సరాల బాలికలకు వేస్తున్న హెచ్ పి.వి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని, తద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది ఈ వ్యాక్సిన్ పై అవగాహన కల్పించి 100% పూర్తయ్యాలా చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం మెరుగుదలకు కృషి చేయడం ద్వారానే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ప్రతి ఒక్కరు కూడా శుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్ సుధా సాగర్, ఏఎంసీ చైర్మన్ పి వి వి గోపాలరాజు, తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ రాపాక అచ్చం నాయుడు, టిడిపి నాయకులు ఈదుపల్లి కృష్ణ, పాసెల సీతారామ్మూర్తి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ వార్డెన్ అంజనా కు స్వర్ణాంధ్ర అవార్డు



**కామవరపుకోట, సెప్టెంబర్ 2 :** గాంధీ జయంతి సందర్భంగా స్థానిక సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్ వార్డెన్ అంజనాకు ఏలూరు కలెక్టర్ వెట్రి సెల్వి శుక్రవారం స్వర్ణాంధ్ర అవార్డును అందజేశారు. వసతి గృహ పరిసరాలను, వంటశాలను, విద్యార్థుల గదులను పరిశుభ్రంగా ఉంచడంతో జిల్లా స్థాయిలో అందజేసే స్వర్ణాంధ్ర అవార్డును కలెక్టర్ అందించినట్లు తెలిపారు. బాలికల హాస్టల్ కావడంతో విద్యార్థులు పట్ల ప్రత్యేకమైన అంకితభావంతో విధులు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవార్డు రావటం సంతోషంతో పాటు విధుల నిర్వహణలో మరింత బాధ్యతను పెంచిందని అంజన తెలిపారు. వార్డెన్ అంజనాకు అవార్డు రావడం పట్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అంజనాకు అభినందనలు తెలిపారు

# జన జాతరలో ఘన గీతం



పల్లె వాడకట్టు నుంచి పట్నంలోని దాటి ట్యాంక్ బండ్ వరకు.. ఈ సారి వినాయక నవరాత్రుల్లో ఒక ఆసక్తికరమైన సాంస్కృతిక దృశ్యం కనిపించింది. మండపంలో గణనాయకుడు.. మది నిండా జననాయకుడు అన్నట్టుగా ఉత్సవాలు సాగాయి. మంత్రోచ్చారణల మధ్య పూజలందుకున్న వినాయకుడి మండపమే కేసీఆర్ గీతాలకు వేదికైంది. డప్పు దరువుకు పల్లె జనం కాలు కదిపింద్రు.. పెద్దలు వంత పాడింద్రు.. యువత గొంతు కలిపింది. నిన్నటి రాజకీయ ప్రచార గీతం.. నేటి పండుగ సంబురంలో భాగం అయింది. ఇది కేవలం రాజకీయ ప్రచారమా? లేక తెలంగాణ సామూహిక జ్ఞాపకంలో సజీవంగా ఉన్న అనుభవమాతెలంగాణలో పండుగలంటే కేవలం పూజల తంతు మాత్రమే కాదు. బతుకమ్మైనా.

# జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థి షేక్ చాన్ బాబు



**కామవరపు కోట, అక్టోబర్ 2:** మండలంలోని జీలకర్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 6 వ తరగతి కి చెందిన విద్యార్థి షేక్ చాన్ బాబు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో పాఠశాల , కళాశాల విద్యార్థులకు జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో 'మహాత్మా గాంధీ సత్యం అహింసా విధానాలు – నేటి పరి స్థితులు ' అనే అంశంపై నిర్వహించిన ఆన్లైన్ చిత్ర లేఖనం పోటీ లో ప్రతిభ కనబరిచి పాఠశాల కు గర్వకారణంగా నిలిచాడు. విజేతలకు పెదనింద్రకొలను మహాత్మా గాంధీ భవనం లో జరిగిన వేడుకలో సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజు చాన్ బాబు కు ప్రశంసాపత్రం, మెమెంటోతో పాటు బహుమతులను అండజేసి అభినందించారు.చాన్ బాబు సాధించిన విజయాన్ని, విద్యార్థికి మార్గదర్శకత్వం అందించిన గైడ్ టీచర్ పి. నాగరాజు మరియు అధ్యాపకుల కృషిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి. భారతీదేవి, సభ్యులు గ్రామస్తులు అభినందించారు.

# బ్యాంక్ లింకేజీలోదేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానం

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

- పారదర్శకత, సాంకేతిక సంస్కరణలతో మహిళా ఆర్థిక సాధికారతకు పెద్దపీట
- వడ్డీ రేట్లు, సర్వీస్ ఛార్జీల తగ్గింపుతో మహిళా సంఘాలకు వేల కోట్ల ఆర్థిక ప్రయోజనం
- ఆధార్ బయోమెట్రిక్,వ్యవస్థలతో నిధుల దుర్వినియోగానికి చెక్



**అమరావతి, అక్టోబర్ 2 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న వినూత్న సంస్కరణలతో స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ కార్యక్రమం కొత్త దిశలో పయనిస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ఆర్ఎల్ఎం తాజా గణాంకాల ప్రకారం, 2026 సెప్టెంబర్ 15 నాటికి ఆంధ్రప్రదేశ్ రూ.15,229.40 కోట్ల రుణ పంపిణీ, రూ.82,639.56 కోట్ల రుణ నిల్వతో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కంటే ముందంజలో నిలిచిందని మంత్రి వెల్లడించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు అందుతున్న ఈ రుణాలు కేవలం తాత్కాలిక సహాయంగా కాకుండా, కుటుంబాల ఆదాయాభివృద్ధికి, స్థిరమైన జీవనోపాధికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డిజిటల్ సంస్కరణలతో పారదర్శకత, ఆర్థిక భద్రత, ఆధార్ బయోమెట్రిక్ ప్రమాణీకరణ, సభ్యుల గుర్తింపు ధృవీకరణ ద్వారా నకిలీ సభ్యత్వాలు, నిధుల దుర్వినియోగానికి చెక్ పెట్టడం జరుగుతుందన్నారు. విశిష్ట రిజిస్ట్రేషన్ నంబర్ విధానంలో ప్రతి సంఘానికి ప్రత్యేక డిజిటల్ గుర్తింపునిచ్చి లావాదేవీల్లో పారదర్శకత పెంపొందిస్తామని మంత్రి తెలిపారు. రియల్‌టైమ్ డాష్‌బోర్డుల ద్వారా బ్యాంకు అధికారులు ప్రొఫైల్స్, గ్రేడింగ్, రుణ వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించే సదుపాయం ఏర్పాటుతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో 'బ్యాంక్ సఖీల' సహకారంతో మహిళలకు డిజిటల్ భద్రతపై అవగాహన కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, సర్వీస్ ఛార్జీలు తగ్గించడం వల్ల ఒక్కో సంఘానికి ఏటా రూ.32,500 వరకు ఆదా అవుతోందని.. గతంలో 7% నుంచి 14.50% వరకు ఉన్న వడ్డీ రేట్లను ప్రామాణీకరించి 7% నుంచి 11.70% పరిధికి తగ్గించడంతో మహిళా సంఘాలపై రుణ వ్యయ భారం గణనీయంగా తగ్గిందన్నారు. వార్షిక క్రెడిట్ జీవనోపాధి ప్రణాళిక మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా వ్యవసాయం, పశుపోషణ, సూక్ష్మ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నామని.మార్గదర్శకాల ప్రకారం లకు హామీ లేని రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచామని తెలిపారు. బ్యాంక్ లింకేజీ లక్ష్యసాధనలో 2024--25లో రు. 32,190 కోట్లకు రు.30,079 కోట్లు రుణ పంపిణీతో 93 % లక్ష్యం చేరుకోగా2025–26లో 99 % లక్ష్యం చేరుకోగా... 2026–27 సంవత్సరంలో సెప్టెంబర్ నాటికి నిర్దేశించిన రు.19,655 కోట్లకు గాను రు.15,229 కోట్లు పంపిణీ చేసి ఇప్పటికే 78 % లక్ష్యం చేరుకున్నట్టు మంత్రి కొండపల్లి తెలిపారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో 90 శాతానికి పైగా లక్ష్యాలను సాధించామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ బ్యాంకులు, సమాఖ్యల సమన్వయంతో నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు."మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం, ప్రతి కుటుంబానికి స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత పురోగతి పథంలో నడిపించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు.

# భారత ప్రధాని శ్రీ నరేంద్రమోదీ ప్రజాసేవకు 25 ఏళ్లు

- ఘనంగా 'సేవా సంకల్ప్ అభియాన్' -మొక్కలు నాటిన మంత్రి కొలుసు పార్థసారథిలి ...



**ఏలూరు/?నూజివీడు, అక్టోబరు 02:** నూజివీడు పట్టణంలోని న్యూ ఎంప్లాయిస్ కాలనీ ఎన్టీఆర్ పార్కులో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా గౌరవ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ప్రజాజీవితంలో, ప్రజాసేవలో విజయవంతంగా 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా 'సేవా మేరా యోగ్ దాన్' పేరిట మంత్రి కొలుసు పార్థసారథి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ప్రధాని శ్రీ నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు దూరదృష్టి, ఎంతో అనుభవం ఉన్ననాయకులు ప్రజాసేవలు పట్ల చూపుతున్న నిబద్ధతను, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయ్యాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటి, సంరక్షించే కార్యక్రమాన్ని ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి అగ్రికల్చర్ మిషన్ వైస్– చైర్మన్ మరియు నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మున్సిపాలిటీ కమీషనరు కె.పీరయ్య,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికే వెళ్లి పెన్షన్ అందించిన ఉద్యోగస్తులు

**కామవరపుకోట, అక్టోబర్ 2 :** ఉద్యోగం అంటే ప్రజా సేవ అని రావికంపాడు, ఆడమిల్లి సచివాలయ సిబ్బంది నిరూపించారు. రావికంపాడు సచివాలయ పరిధిలో షేక్ సయ్యద్ బాజీ గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. విలేజ్ సర్వేయర్ కె. అనిల్ కుమార్ స్వయంగా శుక్రవారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి షేక్ సయ్యద్ బాజీకి నెలవారీ పెన్షన్ ను అందజేశారు.

అలాగే ఆడమిల్లికి చెందిన పారేపల్లి సూరాచారి జంగారెడ్డి గూడెం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సచివాలయ ఉద్యోగి నవీన్ జంగారెడ్డిగూడెం వెళ్లి పెన్షన్ సొమ్మును అందజేశారు. ఆపత్కాల ంలో ఆసుపత్రిలో ఉన్న సమయంలో అవసరా నికి పెన్షన్ డబ్బులు అందించిన ఉద్యోగస్తులకు ఆయా కుటుంబాల వారు కృతజ్ఞతలు తెలిపా రు. ఆయా గ్రామాల మాజీ సర్పంచులు గూడ పాటి కేశవరావు, వేముల శ్రీను మరియు ఈ విషయం తెలిసిన ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# స్వచ్ఛ ఏలూరు జిల్లాకు ప్రజల భాగస్వామ్యం కావాలి కలెక్టర్ వెట్రి సెల్వి.

**ఏలూరు, అక్టోబర్, 2 :** ప్రజా భాగస్వామ్యం తోనే 'స్వచ్ఛ ఏలూరు జిల్లా' సాధ్యమని, జిల్లాను స్వచ్ఛ ఏలూరు జిల్లాగా రూపొందించడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ ఏలూరు కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పరిశుభ్రత అనేది మన జీవితంలో భాగం కావాలన్నారు. స్వచ్ఛత అనేది ముందుగా మన ఇంటినుండే ప్రారంభం కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను ప్రజలందరూ బాధ్యతగా తీసుకోవాలని, తమ ఇంటిలోని చెత్తను రోడ్లపై వేయకుండా, ఇంటిలోని చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరుచేసి ఇంటికి చెత్త సేకరణ కు వచ్చే సిబ్బందికి అందించాలన్నారు. ఆరోగ్యవంతమైన పరిసరాలకు పరిశుభ్రత ఎంతో ప్రధానమని, ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి, స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర లక్షలను సాధించేందుకు కృషిచేయాలన్నారు. మన పిల్లలకు చిన్నతనం నుండే పరిశుభ్రతకు అవగాహన కలిగించాలన్నారు. ఏలూరు నగరంలో వాయు కాలుష్యం తగ్గించి 'స్వచ్ఛ వాయు సర్వేక్షన్' లో జాతీయ స్థాయిలో 4వ స్థానం సాధించామని, అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో కూడా స్వచ్ఛ అవార్డులను మన జిల్లా సాధించిందని, ఇందుకు అధికారులను అభినందిస్తున్నానన్నారు. . ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జాతీయ, రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ అవార్డులు ఏలూరు జిల్లాకు సాధించాలని కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్లాస్టిక్ వినియోగాన్ని కూడా నియంత్రించాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించేందుకు జిల్లాలో 'స్వచ్ఛ రథాలు' మీ వద్దకు వస్తాయని, మీ వద్ద ఉన్న ప్లాస్టిక్ వస్తువులను వారికి అందిస్తే, వాటికి మీకు నిత్యావసర సరుకులు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి మరియు భారత మాజీ ప్రధానమంత్రి లాల్ బహద్దూర్ శాస్త్రిల జన్మదినం సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఈ సందర్భంగా పరిశుభ్రత, పారిశుద్ధ్యం రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరి చిన వ్యక్తులు, సంస్థలు, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ప్రజలు, అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, జిల్లా పంచాయతీ అధికారి జి.వి.కె. మల్లికార్జునరావు, ఏలూరు నగరపాల క సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ పీడీ శారద, మెప్మా పిడి రాజబాబు, సెట్ వెల్ సీఈఓ ప్రభాకరరావు, డిఎంహెచ్ఓ డా. శోభ , ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాధరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దండకం కూడా నోచుకోని మహాత్ముని విగ్రహాలు

**ఏలూరు, అక్టోబర్ 2 :** ఏలూరు జిల్లా కామవరపుకోట మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా జాతిపిత మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలు ఉన్నాయి. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి అయినప్పటికీ అధికారులు గానీ, విగ్రహాలు నెలకొల్పిన వారు కానీ, స్థానికులు కానీ దండకూడా వేయకపోవడం పట్ల ఎంపీడీవో కార్యాలయం సాక్షిగా మహాత్మునికి అవమానం జరిగినట్లుగా అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా ఎంపీడీవో కార్యాలయం గేటు ఎదురుగా ఉన్నప్పటికీ అధికారులు ఎవరూ స్పందించకపోవడం మహాత్మునికి జరిగిన అవమానంగా భావిస్తున్నామన్నారు. ఇది ఇలా ఉండగా మండలంలోని తడికలపూడిలో గాంధీ గారి పేరిట మీద ఏకంగా గాంధీ చౌక్ ఉంది. అయితే ఆ ప్రాంతంలో ఉన్న మహాత్ముని విగ్రహానికి మధ్యాహ్నాం మూడు అయినప్పటికీ ఏ ఒక్కరు దండ వేయకపోవడం బాధను కలిగిస్తుందన్నారు. ఇదిలా ఉండగా గాంధీ జయంతి సందర్భంగా మద్యం, మాంసం దుకాణాలు మూసివేయాలనే నిబంధన ఉన్నప్పటికీ మండలంలో అనేక మద్యం గొలుసు (బెల్ట్) దుకాణాలతో పాటు, మాంసం విక్రయ కేంద్రాలు కూడా తెరిచి ఉండటం బాధాకరమని, అధికారులు చూచి చూడనట్లు




వ్యవహరించటంతోనే ఇటువంటి పరిణామాలు జరుగుతున్నాయని మహాత్మ గాంధీ అభిమానులు పేర్కొన్నారు. అయితే సోషల్ మీడియా వేదికగా మహాత్మునికి జరుగుతున్న అవమానాన్ని పలువురు ప్రశ్నించగా స్థానికులు కొందరు స్పందించి మహనీయుని విగ్రహాలకు దండలు వేయడం జరిగింది.

# చివరి వన్డేలో టీమిండియా కీలక మార్పులు

భారతదేశం వేదికగా జరుగుతున్న భారత్, వెస్టిండీస్ మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఆఖరి పోరుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లలో ఘన విజయాలు సాధించిన టీమిండియా 2-0 తేడాతో అజేయమైన ఆధిక్యాన్ని దక్కించుకుంది. ఇప్పుడు ఆదివారం జరగనున్న మూడో అలాగే చివరి వన్డేలో వెస్టిండీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలని పట్టుదలగా ఉంది. అదే సమయంలో ఇప్పటివరకు తుది జట్టులో ఆడే అవకాశం రాని రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లను మైదానంలోకి దించి వారి ప్రతిభను పరీక్షించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మహారాజా యదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. గౌహతిలో జరిగిన రెండో వన్డేలో భారత్ అద్భుతమైన ప్రదర్శన చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో కెప్టెన్ శుభమన్ గిల్ అజేయంగా 223 పరుగులు చేయగా, రోహిత్ శర్మ 101 పరుగులతో రాణించారు. అయితే ఈ సిరీస్‌లో బ్యాటింగ్‌కు అనుకూలంగా పిచ్‌లు మారుతుండటంపై విమర్శలు వస్తున్నాయి. గత మ్యాచ్‌లో రెండు జట్లు కలిసి ఏకంగా 800లకు పైగా పరుగులు సాధించడం విశేషం. భారత్ ప్రధాన కోచ్ గౌతం గంభీర్ సైతం బ్యాట్, బాల్ మధ్య సరైన బ్యాలెన్సింగ్ ఉండాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భారత బౌలర్లు మిగతా ఓవర్లలో వికెట్లు తీయడానికి కాస్త ఇబ్బంది పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సిరీస్ ఇప్పటికే మనవశం కావడంతో మేనేజ్‌మెంట్ తుది జట్టులో కొన్ని ప్రయోగాలు చేయడానికి ఇది సరైన సమయంగా భావిస్తోంది. రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, మొహమ్మద్ సిరాజ్ వంటి ఆటగాళ్లకు తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. తొలి రెండు మ్యాచ్‌లలో ఓపెనర్లు రోహిత్, గిల్‌తో పాటు కోహ్లీ కూడా అద్భుతంగా రాణించారు. స్క్వాడ్‌లో మొత్తం 15 మంది ఆటగాళ్లు ఉండగా, కేవలం బెంచ్‌కే పరిమితమైన వారికి ఆడే




సమయం లభిస్తుంది. అయితే గత మ్యాచ్‌లో ఎడమ కాలి హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ప్రసిద్ధ్ కృష్ణ చివరి మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో అన్షుల్ కంబోజ్ జట్టులోకి వచ్చాడు. భారత పేస్ బౌలింగ్ విభాగంలో యువ ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. తొలి రెండు మ్యాచ్‌లలో ఆడే అవకాశం రాని స్థానిక పేసర్ మొహమ్మద్ సిరాజ్ తుది జట్టులోకి తిరిగి వచ్చే ఛాన్స్ ఉంది. శ్రీలంక పర్యటన తర్వాత సిరాజ్ తన అత్యుత్తమ లయను అందుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు. గురునూర్ బ్రార్, ఆకిబ్ నబీ వంటి యువ సంచలనాలు కూడా అవకాశాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ ఏడాది చివరిలో న్యూజిలాండ్‌తో జరగబోయే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు, ఈ ఆఖరి వన్డే యువ బౌలర్లకు తమ సత్తా నిరూపించుకోవడానికి గొప్ప వేదిక కానుంది. ముల్లాంపూర్ వేదికగా పురుషుల వన్డే మ్యాచ్ జరగడం ఇదే మొదటిసారి. ఇక్కడి పిచ్ బౌలర్లకు కొంత వరకు సహకరిస్తుందని భావిస్తున్నారు. సిరీస్ కోల్పోయినప్పటికీ, వెస్టిండీస్ జట్టు తమ బ్యాటింగ్‌తో ఆకట్టుకుంది. గత మ్యాచ్‌లో ఆ జట్టు 405 పరుగులు సాధించి సంచలనం సృష్టించింది. జాన్ క్యాంప్‌బెల్, షై హోప్, అమీర్ జాంగూ సెంచరీలతో అదరగొట్టారు. భారత్ చేతిలో ఓడిపోయినప్పటికీ, తమ బ్యాటింగ్ వైఫల్యాలను సరిదిద్దుకొని ఈ ఆఖరి మ్యాచ్‌లో విజయం సాధించి పరువు నిలుపుకోవాలని కరీబియన్ జట్టు భావిస్తోంది.

# కొన్ని విషయాలు మనతోనే ఉండాలి

**• రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు**




వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో అద్భుత శతకంతో మెరిసిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన ప్రత్యేక సంబరాలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. సెంచరీ పూర్తయ్యాక సాధారణంగా బ్యాట్ పైకెత్తే క్రికెటర్లకు భిన్నంగా.. హిట్‌మ్యాన్ హై-నీ జాగింగ్ తరహాలో వినూత్నంగా అడుగులు వేస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఈ డిఫరెంట్ సెలబ్రేషన్ వెనుక ఉన్న రహస్యమేంటని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, రోహిత్ స్పందిస్తూ.. "కొన్ని విషయాలు మనతోనే ఉండాలి, ప్రతీదీ బయటకు చెప్పాల్సిన అవసరం లేదు" అని వ్యాఖ్యానించడం విశేషం. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ విధించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో రోహిత్ శర్మ (75 బంతుల్లో 101) కీలక పాత్ర పోషించాడు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (223 నాటౌట్)తో కలిసి తొలి వికెట్‌కు ఏకంగా 255 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ క్రమంలోనే రోహిత్ తన వన్డే కెరీర్‌లో 35వ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత తన వైరల్ సెలబ్రేషన్ గురించి రోహిత్ మాట్లాడుతూ, అది తన వ్యక్తిగత విషయమని స్పష్టం చేశాడు. మైదానంలోనే ఉన్న రవీంద్ర జడేజా కూడా ఈ సంబరం వెనుక ఉన్న కారణాన్ని అడగ్గా, డ్రెస్సింగ్ రూమ్‌కి వచ్చాక చెబుతానని దాటవేసినట్లు రోహిత్ తెలిపాడు. అయితే డైవ్ చేస్తూ, గాల్లోకి ఎగురుతూ జెట్ స్పీడ్‌లో సంబరాలు చేసుకోవాలని జడేజా సలహా ఇచ్చాడని, కానీ 50 ఓవర్లు ఫీల్డింగ్ చేసి, మరో 30 ఓవర్లు బ్యాటింగ్ చేసిన తనకు అంత శక్తి లేదని సరదాగా సమాధానమిచ్చానని రోహిత్ పేర్కొన్నాడు. భారీ ఛేదనలో స్కోరుబోర్డు ఒత్తిడిని పక్కనపెట్టి కేవలం భాగస్వామ్యంపైనే దృష్టి పెట్టామని రోహిత్ వెల్లడించాడు. ఆఖరి వరకు నిలబడి డబుల్ సెంచరీతో జట్టును గెలిపించిన గిల్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు.

# ఆస్ట్రేలియా ఏ జట్టుతో రెండో టెస్టు ఉత్కంఠభరిత డ్రా




**• 1-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ ఏ జట్టు**

భారత్ ఏ, ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య జరిగిన రెండో అనధికారిక టెస్టు మ్యాచ్ థ్రిల్లర్‌ను తలపించింది. చివరి రోజు అసాధారణ పోరాటపటిమ కనబరిచిన యశ్ రాథోడ్, షామ్స్ ములానీ గట్టి పట్టుదలతో క్రీజులో నిలబడి మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఏ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. తొలి టెస్టులో 162 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్, ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో సిరీస్ విజేతగా నిలిచింది. శుక్రవారం, నాలుగో రోజు ఆటలో 365 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్ ఏ, ఆట ముగిసే సమయానికి 103 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. విజయానికి 55 పరుగుల దూరంలో నిలిచినప్పటికీ, ఆసీస్ బౌలర్ల నిరంతర దాడిని తట్టుకుని ఓటమిని తప్పించుకోవడంలో సఫలమైంది. నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన తుషార్ దేశ్‌పాండే (52), యశ్ రాథోడ్ (80) హాఫ్ సెంచరీలతో కీలక పాత్ర పోషించగా, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన షామ్స్ ములానీ (131 బంతుల్లో 26) అద్భుతమైన డిఫెన్స్‌తో మ్యాచ్‌ను కాపాడాడు. నాలుగో రోజు ఆట ప్రారంభంలోనే భారత్ ఏ పై ఒత్తిడి పెరిగింది. అయితే నైట్‌వాచ్‌మన్ తుషార్ దేశ్‌పాండే సుమారు 180 నిమిషాల పాటు క్రీజులో నిలబడి ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. కెప్టెన్ దేవదత్ పడిక్కల్ (26)తో కలిసి 60 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే లంచ్ తర్వాత ఆసీస్ బౌలర్ లియామ్ స్కాట్ (5/52) తన పదునైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వైవిధ్యభరిత బౌన్స్‌తో ఇబ్బంది పెడుతూ పడిక్కల్, దేశ్‌పాండేలతో పాటు తొలి మ్యాచ్ సెంచరీ హీరో కుమార్ కుశాగ్రను కూడా పెవిలియన్ చేర్చాడు. దీంతో భారత్ ఏ 199 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో యశ్ రాథోడ్, షామ్స్ ములానీ జతకలిశారు. ఓటమి అంచున ఉన్న జట్టును గట్టెక్కించడానికి వీరోచితంగా పోరాడారు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 131 బంతులు ఎదుర్కొని 85 పరుగుల అమూల్యమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మ్యాచ్ డ్రా దిశగా సాగుతున్న దశలో లియామ్ స్కాట్ మళ్లీ చెలరేగాడు. మొదట రాథోడ్‌ను, ఆ తర్వాత ములానీని ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి ఉత్కంఠను తారాస్థాయికి చేర్చాడు. చివరి మూడు ఓవర్లు మిగిలి ఉండగా భారత్ చేతిలో ఒక్క వికెట్ మాత్రమే ఉంది. అన్షుల్ కంబోజ్ స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ప్రఫుల్ హింగేతో కలిసి నచికేత్ భూతే (20 నాటౌట్) చివరి ఓవర్లను జాగ్రత్తగా ఆడి మ్యాచ్‌ను డ్రాగా ముగించాడు. దీంతో భారత్ ఏ శిబిరంలో సంబరాలు మిన్నంటాయి.

# హార్దిక్ లేకుండా 2027 వన్డే ప్రపంచకప్ గెలవడం కష్టం

**- మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ సూచన**




వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీలో భారత్ విజయం సాధించాలంటే ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఉండటం కీలకమని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. అతను ఉంటే జట్టు సమతూకంగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ పాండ్యా పూర్తిగా ఫిట్‌గా ఉంచి, ప్రపంచకప్‌కు సిద్ధం చేయడం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ముందున్న అతి పెద్ద సవాల్ అని చెప్పుకొచ్చాడు.ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027 షెడ్యూల్‌ను ఐసీసీ గురువారం ప్రకటించింది. అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరగనుంది. తొలి మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్‌తో భారత్ తలపడనుంది. హార్దిక్ పాండ్యా ఇప్పటికే 2019, 2023 ప్రపంచకప్‌లు ఆడాడు. 2023లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా చీలమండ గాయం కావడంతో టోర్నీకి దూరమయ్యాడు. అతని గైర్హాజరీ టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసింది.తాజాగా మెగా టోర్నీ గురించి మాట్లాడిన గంగూలీ.. హార్దిక్ పాండ్యా అవసరాన్ని నొక్కి చెప్పాడు. 'ప్రపంచకప్‌లో టీమిండియా కాంబినేషన్‌కు హార్దిక్ పాండ్యా చాలా ముఖ్యం. అతన్ని మైదానంలో ఫిట్‌గా ఉంచడం గంభీర్ ముందున్న అతి పెద్ద సవాల్. ప్రస్తుతం అతను తగినంత క్రికెట్ ఆడటం లేదు. ఒకవేళ హార్దిక్ పాండ్యా అందుబాటులో లేకపోతే నితీష్ రెడ్డి ప్రత్యామ్నాయం అవుతాడు. కానీ నితీశ్‌ను హార్దిక్‌కు ప్రత్యామ్నాయంగా చూడాలంటే అప్పటివరకు అతను నిలకడగా క్రికెట్ ఆడాలి. ఆ స్థాయిలో ప్రదర్శన చేయాలి.'అని సౌరవ్ గంగూలీ జియో హాట్‌స్టార్‌తో అన్నాడు. 'రవీంద్ర జడేజా కూడా మరో ప్రత్యామ్నాయం. కానీ సౌతాఫ్రికా కండిషన్స్‌లో స్పిన్ కంటే పేస్ ఆల్‌రౌండర్ అవసరం ఉంటుంది. భారత టాప్-5 బ్యాటర్లలో ఎవరూ బౌలింగ్ చేయరు కాబట్టి. భారత్‌కు ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ కావాలంటే ఆల్‌రౌండర్‌ను ఆడించాల్సిందే. తొలి మ్యాచ్‌లోనే భారత్ బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవడం మంచిదే. సెకండాఫ్‌లో సౌతాఫ్రికాతో జరిగే మ్యాచ్ కోసం నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. సొంత గడ్డపై జరిగే ప్రపంచకప్‌కు సౌతాఫ్రికా బలమైన జట్టుతో బరిలోకి దిగుతోంది.'అని గంగూలీ చెప్పుకొచ్చాడు. భారత మాజీ వికెట్‌కీపర్ పార్థివ్ పటేల్ కూడా షెడ్యూల్‌పై స్పందించాడు. ఆరంభంలోనే రెండు కఠినమైన మ్యాచ్‌లు ఆడటం ద్వారా టీమిండియా కాంబినేషన్‌ను పరీక్షించుకోవచ్చని, కీలక ఆటగాళ్ల ఫిట్‌నెస్, ఫామ్, వర్క్‌లోడ్‌ను అవసరానికి తగ్గట్టు చూసుకోవచ్చని చెప్పాడు. ఈ ఫార్మాట్ పాకిస్థాన్‌కు బాగా నచ్చుతుందని, కనీసం సూపర్ 7 చేరవచ్చని ఆ జట్టు భావిస్తుందని సెటైర్లు పేల్చాడు.

# రిటైర్మెంట్ ప్రకటించిన యుజ్వేంద్ర చాహల్!

టీమిండియా వెటరన్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ రెడ్ బాల్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్‌తో పాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. కౌంటీ క్రికెట్‌లో భాగంగా లార్డ్స్‌లో తన చివరి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడిన అనంతరం చాహల్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. దాంతో భారత్ తరపున టెస్ట్ క్రికెట్ ఆడాలనే చాహల్ కలలకు అధికారికంగా తెరపడినట్లయింది. వైట్‌బాల్ క్రికెట్‌లో మాత్రం రీఎంట్రీ కోసం తన ప్రయత్నాలు కొనసాగుతాయని స్పష్టం చేశాడు. 'భారత్ తరపున టెస్ట్ క్యాప్ అందుకోవడం నా కెరీర్ లో అతిపెద్ద కల. కానీ ఇకపై అది నెరవేరకపోవచ్చు. ఈ ఫార్మాట్‌లో ఇప్పటివరకు సాగిన నా ప్రయాణం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. రెడ్ బాల్ క్రికెట్ అనేది ఓ ఫార్మాట్ మాత్రమే కాదు. ఆటగాళ్లకు ఓపిక, క్యారెక్టర్, మైదానంలో కొన్ని గంటల పాటు శ్రమించడంలో ఉన్న అసలైన సంతోషాన్ని తెలియజేస్తుంది.'అని చాహల్ చెప్పుకొచ్చాడు. హర్యానా తరపున 2009లో చాహల్ ఫస్ట్‌క్లాస్ కెరీర్‌ను ప్రారంభించాడు. తన 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 49 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. 32.27 యావరేజ్‌తో 148 వికెట్లు నేలకూల్చాడు. కౌంటీ క్రికెట్‌లో ఇంగ్లండ్ నార్తాంప్టన్‌షైర్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించిన చాహల్..



# 'నా వైఫ్ మిస్సింగ్'.. చాలాకాలం తర్వాత మళ్లీ జోడీగా వరుణ్ సందేశ్, శ్వేతా బసు




'కొత్త బంగారు లోకం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జంట చాలా కాలం తర్వాత మళ్లీ తెరపైకి రాబోతోంది. వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో 'ఆహా' ఓటీటీ సమర్పిస్తున్న సరికొత్త ఒరిజినల్ సిరీస్ 'నా వైఫ్ మిస్సింగ్'. వినూత్నమైన కంటెంట్‌తో సబ్‌స్క్రైబర్లను నిరంతరం ఆకట్టుకుంటున్న ఆహా, ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. భార్య కనపడటం లేదంటూ ఒక భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ కథ మొదలవుతుంది. ఈ కేసులో నిజమేంటి అనే అంశం చుట్టూ కథనం సాగుతుందని తెలుస్తోంది. ఇటీవల ఆహా విడుదల చేసిన అప్‌డేట్‌లో "ప్రతి కేసుకు ఒక కథ ఉంటుంది, ఈ కేస్ లో నిజం ఏంటి?" అనే క్యాప్షన్ ప్రేక్షకులలో క్యూరియాసిటీని మరింత పెంచింది. తన భార్య మిస్సయ్యిందంటూ వరుణ్ సందేశ్ కంప్లైంట్ ఇవ్వడం, దాని వెనుక ఉన్న రహస్యం ఏమిటనేది సిరీస్‌లో ఉత్కంఠభరితంగా చూపించనున్నారని సమాచారం.వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్‌లది టాలీవుడ్‌లో ఒక సక్సెస్‌ఫుల్ పెయిర్. 'కొత్త బంగారు లోకం' తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడంతో సిరీస్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ జంట మళ్లీ కలిసి నటించడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.ఈ సిరీస్‌ను తెలుగుతో పాటు తమిళ భాషల్లో కూడా ఒకేసారి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆహా ప్రకటించింది. మిస్సింగ్ కేసు వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? నిజంగానే శ్వేతా బసు పాత్ర అదృశ్యమైందా? లేక దీని వెనుక ఇంకేదైనా కుట్ర ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే. త్వరలోనే 'నా వైఫ్ మిస్సింగ్' స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటిస్తామని ఆహా టీమ్ తెలిపింది.

# రజనీకాంత్ 'జైలర్ 2' ట్రైలర్‌కు ముహూర్తం ఖరారు.. పండగకు ముందే రానున్న టైగర్!




సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 5, 2026న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే యూట్యూబ్‌లో ఈ సినిమా పేరుతో అనేక ఫ్యాన్-మేడ్, కాన్సెప్ట్ ట్రైలర్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 5న రాబోయేది అఫీషియల్ ట్రైలర్ అని మేకర్స్ స్పష్టతనిచ్చారు. ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి తన ఐకానిక్ 'టైగర్' ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు.ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన 'హుకుమ్ రీలోడెడ్' థీమ్ సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది.

తారాగణం పరంగా కూడా ఈ సీక్వెల్ మరింత భారీగా ఉండనుంది. ఎస్.జె. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, తొలి భాగంలో అదరగొట్టిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్‌లతో పాటు ఈసారి విజయ్ సేతుపతి కూడా ప్రత్యేక అతిథి పాత్రలో మెరవనున్నారు. దీంతో 'జైలర్ 2'పై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.ం

# తెలుగులోకి 'హనుమాన్ అంశ్'.. రిలీజ్ డేట్ వచ్చేసింది!




ఆధ్యాత్మిక కథాంశంతో తెరకెక్కిన 'హనుమాన్ అంశ్' సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు సాధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్ల మార్క్‌ను దాటిన ఈ సినిమా.. ఎట్టకేలకు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా తెలుగు వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది.నిజానికి ఈ సినిమా తెలుగు వెర్షన్ సెప్టెంబర్ 18న విడుదల కావాల్సి ఉంది. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు చెందిన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తెలుగు వెర్షన్‌ను సమర్పించనున్నట్లు తొలుత ప్రచారం జరిగింది. అయితే డీల్ కుదరకపోవడంతో త్రివిక్రమ్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం.

సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో తెలుగు టీజర్‌ను విడుదల చేసేందుకు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే చివరి నిమిషంలో ఆ కార్యక్రమం రద్దయింది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ స్వయంగా తెలుగు విడుదల బాధ్యతలను తీసుకుంది.

కేవలం రూ.1.8 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కినట్లు చెబుతున్న ఈ సినిమా.. సెప్టెంబర్ 28 నాటికి భారత్‌లో రూ.300 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించింది. 52వ రోజుకు ఈ మార్క్‌ను అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు రావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది.విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ సినిమా.. నీమ్ కరోలి బాబా జీవిత ప్రేరణతో తెరకెక్కిన ఆధ్యాత్మిక కథ. లక్ష్మీ నారాయణ్ అనే వ్యక్తి ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్లి ప్రముఖ సాధువుగా ఎలా మారాడన్నదే కథ. నీమ్ కరోలి బాబా పాత్రలో శోభినవ్ సత్యా నటించారు. విహాన్ షెదెగే, పూర్ణిమ తివారీతో పాటు పలువురు కీలక పాత్రల్లో కనిపించారు.

# 'రణబాలి' పాత్ర వెనుక ముగ్గురు రాయలసీమ వీరులు..

## డైరెక్టర్ రాహుల్ ఆసక్తికర విషయాలు!



విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ఆసక్తి పెరుగుతోంది. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడిన సింగనమల బొబ్బిలి రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ కనిపించనున్నారు. దసరా కానుకగా అక్టోబరు 16న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సినిమా మేకింగ్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను చిత్ర బృందం వెల్లడిస్తోంది.

'రణబాలి' పాత్రను రాయలసీమకు చెందిన ముగ్గురు పాలెగాళ్ల వీరోచిత గాథల నుంచి స్ఫూర్తి పొంది తీర్చిదిద్దినట్లు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తెలిపారు. బుడ్డా వెంగళ్‌రెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గడేకల్ బొబ్బిలి నాగిరెడ్డి జీవితాలు ఇందులో కీలకంగా నిలిచాయని చెప్పారు.

ఈ ముగ్గురు వీరుల కథలు ఇప్పటికీ రాయలసీమలో పాటల రూపంలో ప్రచారంలో ఉన్నాయని రాహుల్ తెలిపారు. వారి జీవితాల్లోని వీరోచిత ఘటనలు, ప్రజల్లో ప్రచారంలో ఉన్న కథనాల నుంచి అంశాలను తీసుకుని 'రణబాలి' పాత్రను రూపొందించినట్లు వివరించారు. దీంతో విజయ్ పోషిస్తున్న పాత్ర వెనుక రాయలసీమ చరిత్ర, జానపద గాథల ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది.బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా విజయ్ దేవరకొండను ఈ సినిమాలో చూపించనున్నారు. రష్మిక కథానాయికగా నటిస్తోంది. పీరియాడికల్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ యాక్షన్ డ్రామాను దసరా సందర్భంగా అక్టోబరు 16న థియేటర్లలో విడుదల చేయనున్నారు.



# లెజెండ్‌తో స్క్రీన్ పంచుకోబోతున్న భాగ్యశ్రీ..



సౌత్ సినిమా ఇండస్ట్రీలో వరుస అవకాశాలతో దూసుకెళ్తున్న అందాల భామ భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం మలయాళంలోకి గ్రాండ్‌గా అడుగుపెడుతోంది. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో, నేషనల్ అవార్డు గ్రహీత విష్ణు మోహన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఆపరేషన్ గంగా'లో ఆమె నటిస్తోంది. తాజాగా మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఒక బ్యూటిఫుల్ పిక్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఆమె పెట్టిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఆ విశేషాలు చూద్దాం..చారిత్రాత్మక రెస్క్యూ ఆపరేషన్ కథాంశం: రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు మరియు పౌరులను సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన చారిత్రాత్మక 'ఆపరేషన్ గంగ' ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇక దేశభక్తి మరియు ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో సాగే ఈ కథపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. 'శ్రీ గోకులం మూవీస్' బ్యానర్‌పై గోకులం గోపాలన్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.స్టార్ కాంబినేషన్‌తో క్రేజీ ప్రాజెక్ట్: ఈ చిత్రంలో మోహన్‌లాల్ సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, ఆదిల్ హుస్సేన్ మరియు పార్థిబన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ సినిమాకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తుండగా, సౌత్ కొరియన్ స్టంట్ డైరెక్టర్ ఓ సే-యెంగ్ యాక్షన్ సీక్వెన్స్‌లను కొరియోగ్రఫీ చేస్తున్నారు. మోహన్‌లాల్‌పై భాగ్యశ్రీ ప్రశంసల జల్లు: ఇటీవల 'లెనిన్' సినిమాతో కెరీర్‌లో తొలి భారీ హిట్ అందుకున్న భాగ్యశ్రీ బోర్సే, ఈ సక్సెస్ జోష్‌లోనే మలయాళ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తోంది. మోహన్‌లాల్‌తో కలిసి పనిచేస్తున్న అనుభూతిని పంచుకుంటూ సోషల్ మీడియాలో ఆయనతో ఉన్న పిక్‌ను షేర్ చేసింది. "ప్రియమైన మోహన్ లాల్ సార్, మీతో పని చేయడం నాకు ఎంతో గొప్ప అవకాశం.. ప్రతి రోజూ షూటింగ్‌లో మీ నుంచి చాలా విషయాలు నేర్చుకుంటున్నాను. మీరు నిజంగా అద్భుతమైన టాలెంట్ సార్" అంటూ తనకున్న అభిమానాన్ని చాటుకుంది. ఫాన్స్ కూడా ఈ క్రేజీ కాంబో కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని కామెంట్లు పెడుతున్నారు. దిగ్గజ నటుడు మోహన్‌లాల్ పక్కన నటించే గోల్డెన్ ఛాన్స్ దక్కించుకోవడం భాగ్యశ్రీ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవనుంది. 'ఆపరేషన్ గంగా' సినిమాతో ఆమె మలయాళంలోనూ తన సత్తా చాటడానికి సిద్ధమవుతోంది. లెనిన్ సక్సెస్ తర్వాత వస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ భాగ్యశ్రీ రేంజ్‌ను మరింత పెంచడం ఖాయం.

# సమంతకు భారీ ఊరట..

## డీప్‌ఫేక్‌లపై బాంబే హైకోర్టు సీరియస్



సినీ నటి సమంతకు బాంబే హైకోర్టులో భారీ ఊరట లభించింది. డీప్ ఫేక్‌లు, ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేసే వారిపైనై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇతరుల ఫోటోలనే మార్ఫింగ్ చేయడం తదితర చర్యలు ఇతరుల హక్కులను ఉల్లంఘించడం కిందకు వస్తుందని కోర్టు తెలిపింది. ఈ మేరకు సమంత పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం సమంతకు సంబంధించిన అనధికారిక కంటెంట్ తొలగించాలని ఆదేశించింది. కాగా.. సమంత వ్యక్తిత్వ హక్కులకు సంబంధించి బాంబే హైకోర్టులో పిటిషన్ వేసింది. ఏఐ ప్లాట్‌ఫామ్‌లు, ఈ కామర్స్ పోర్టల్స్, డిజిటల్ మీడియా సంస్థలలో తన పేరు, ఫొటోలు, తన వాయిస్‌ను అనధికారికంగా ఉపయోగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. తన వ్యాపారం, గుడ్2విల్, ముంబైలో ఉన్నప్పటికీ చాలా వాణిజ్య కార్యకలాపాలు కోర్టు స్థానిక ప్రాదేశిక అధికార పరిధిని దాటి విస్తరించాయని సమంత తన పిటిషన్‌లో సమర్పించింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం సమంతకు సంబంధించిన అనధికారిక కంటెంట్‌ను తొలగించాలని కూడా కోర్టు ఆదేశించింది. సమంత పేరు, ఫోటోలు, గొంతు అనధికారికంగా ఉపయోగించకుండా నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణ డిసెంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com